



ఉట్టిపడిన ఆనందం



ఆనందుడే!

ఆనందం ఉట్టిపడింది.. ఆబాలగోపాలం వేడుకల్లో మునిగితేలారు.. ఆనందంగా పండుగ చేసుకున్నారు.. కృష్ణాష్టమి సందర్భంగా శనివారం ఉదయం నుంచి కృష్ణాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.. రాజమహేంద్రవరం, కొవ్వూరు, తాళ్లపూడి తదితర మండలాలకు భక్తజనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కృష్ణుడి సేవలో తరించారు.. రారా కృష్ణయ్యా, రారా కృష్ణయ్యా అంటూ పిలుస్తూ మురిశారు.. తమ ఇంట చిన్నారులకు కృష్ణాగోపికల అలంకారం చేసి తల్లిదండ్రులు కన్నులారా చూసుకుని మురిసిపోయారు.





రాజమహేంద్రవరం ఇస్కాన్‌లో ప్రత్యేకఅలంకరణలో రాధాకృష్ణులు.. స్వామికి పుష్పాభిషేకం..



కొవ్వూరు గౌడీయమఠంలో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు



హ్యాప్పీగా!
ప్రయాణం పండగే

(కాకినాడ/రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)
రాష్ట్రప్రభుత్వం శుక్రవారం నుంచి ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణం పథకానికి అనూహ్య స్పందన లభిస్తోంది. మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తూ ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. కేవలం ఆధార్ చూపించి జీరో ఫేర్ టికెట్‌తో ప్రయాణించడం సరికొత్తగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చడంతో మహిళలు నీరాజనం పడుతున్నారు. ఆగస్టు 15న ప్రారంభమైన ఈ పథకం కింద తొలిరోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,283 మంది మహిళలు ఉచితంగా ఐదు రకాల ఫ్రీబస్సుల్లో ప్రయాణించారు. అది కూడా శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి 12 గంటల్లోపు. అంటే కేవలం తొలిరోజు కేవలం ఏడు గంటల వ్యవధిలో 8,283 మంది రికార్డుస్థాయిలో ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకోవడం విశేషం. రెండో రోజైన శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 36 వేల మంది వరకు ఫ్రీగా ప్రయాణించారు. ప్రస్తుతం వరుస సెలవులు కావడంతో ఉచిత బస్సు ప్రయాణానికి రద్దీ అంతంతమాత్రంగానే ఉంది. సోమవారం నుంచి లక్షల్లో ప్రయాణిస్తారని అధికారులు అంచనా వేశారు.

సూపర్‌హిట్ పథకం..

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా టీడీపీ ఇచ్చిన ఉచిత బస్సు పథకం శుక్రవారం నుంచి అమల్లోకి రావడంతో మహిళాలోకం సంబరాలు చేసుకుంటోంది. మహిళలు తమ ఆధార్‌కార్డులు చూపించగా గమ్యస్థానం ఆధారంగా టికెట్ చార్జీని ప్రస్తావిస్తూ కండక్టర్లు జీరోఫేర్ టికెట్ అందించారు. తూర్పుగోదావరి జిల్లాలో నాలుగు డిపోల పరిధిలో 2,345 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు.అత్యధికంగా రాజమహేంద్రవరం డిపోలో ఉన్నారు. రెండో రోజైన శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించినట్టు అధికారులు అంచనా వేశారు. ప్రతిరోజు అర్ధరాత్రి 12 దాటిన తర్వాత ఆ రోజు మొత్తం జీరోఫేర్ టికెట్లు ఎన్ని జారీ చేశారో లెక్కించి తద్వారా ఆ రోజు ఫ్రీ బస్సు ప్రయాణాలెన్ని అనేది అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారు. ప్రస్తుతం సెలవులు ఉన్న నేపథ్యంలో ఫ్రీ బస్సు ప్రయాణాలకు రద్దీ భారీ స్థాయిలో ఉండడం లేదని..దీంతో ఆర్టీసీ సిబ్బందికి కొంత ఉపశమనం కలిగినట్టు అధికారులు చెబుతున్నారు.సోమవారం నుంచి ఉచితబస్సు ప్రయాణం చేసే మహిళలు భారీ స్థాయిలో పెరుగుతారని అంచనా వేస్తున్నారు.ఉమ్మడి జిల్లాలో సోమవారం నుంచి సరాసరి రోజుకు 1.90 లక్షల మందికిపైనే మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

- స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్
- ఉమ్మడి జిల్లాలో భారీ స్పందన
- ఫస్ట్ డే 8,283 మంది ప్రయాణం
- శనివారం 36 వేలని అంచనా
- సెలవులు కావడంతో తక్కువ రద్దీ
- సోమవారం నుంచి కిటకిట
- 1.90 లక్షలకు పెరగొచ్చని అంచనా
- ఆర్టీసీ అధికారుల ప్రత్యేక ఏర్పాట్లు
- వాడపల్లి స్పెషల్ బస్‌లకు టిక్కెట్

తూర్పున 283 బస్‌లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)
మహిళలు హ్యాప్పీగా ప్రయాణిస్తున్నారు.. టిక్కెట్ ఊసులేకపోవడంతో ఆనందంగా బస్‌లు ఎక్కుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 99 బస్సు రూట్లు ఉన్నాయి. అందులో 72 రూట్లలో ఉచిత ప్రయాణం అనుమతించారు. సూపర్‌లగ్జరీ, ఇంద్ర తదితర బస్సులు తిరిగే 23 రూట్లలో మాత్రం ఉచిత ప్రయాణం అనుమతించ లేదు. జిల్లాలో మొత్తం 283 బస్సులు ఉండగా 223 బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. రెండో రోజు సుమారు 95 శాతం మహిళలు ప్రయాణం చేశారు. సాధారణ ప్రయాణికులతో పాటు ప్రైవేట్, ప్రభుత్వ శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగినులు సంబరపడుతున్నారు. రూట్ల సంఖ్యను పెంచడంతో పాటు సమయపాలన పాటించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.బస్ సౌకర్యం లేని గ్రామాలకు బస్సులు పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. రాజమండ్రి షెల్టాన్ సెంటర్ వద్ద బస్సు పాయింట్ సరి చేయాలని పలువురు మహిళలు తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి అమలాపురం రూట్‌లో ఎక్స్‌ప్రెస్‌లు అధికం.రాజమహేంద్రవరం, రావులపాలెం, కొత్తపేట తర్వాత అమలాపురంలో మాత్రమే ఆగుతాయి. ఇక్కడ టికెట్ రూ.75.పల్లె వెలుగు బస్సులకంటే వేగంగా వెళతాయి.అందువల్ల ఈ రూట్ మహిళా ప్రయాణికులు ఉచితంగా వేగంగా ప్రయాణించే అవకాశం ఉంటుంది. ఎక్కువ మంది ఉద్యోగులు రాజమహేంద్రవరం నుంచి కాకినాడకు నాన్ స్టాప్‌లో వెళతారు.కానీ నాన్ స్టాప్‌కు ఉచితం వర్తించదు. తుని, అన్నవరం రూట్లలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు బాగా ఉపయోగపడుతున్నాయి. సోమవారం నుంచి ప్రయాణికులు పెరుగుతారు.



వాడపల్లి స్పెషల్‌కు.. 'నో ఫ్రీ'..

వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రత్యేక బస్సుల్లో నో ఫ్రీ. జిల్లా వ్యాప్తంగా వాడపల్లికి 22 బస్సు సర్వీసులు వివిధ డిపోల నుంచి నడుపుతున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 90 బస్సులు వస్తుంటాయి. ఈ బస్సు సర్వీసులన్నింటినీ ప్రత్యేక సర్వీసులుగా పరిగణిస్తూ ఆదేశాలు రావడంతో శనివారం తెల్లవారుజామునే డిపోలకు చేరుకున్న మహిళా భక్తులకు ఆర్టీసీ షాక్ ఇచ్చింది. స్పెషల్ సర్వీసులకు టిక్కెట్లు తీసుకోవాలని చెప్పడంతో ప్రయాణికులంతా అవాక్కయ్యారు. వాడపల్లి ఆలయానికి వచ్చిన ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల ముందు స్త్రీశక్తి పథకం వర్తించదని బోర్డులు పెట్టారు. వాడపల్లి ఆలయానికి వెళ్లే మహిళా భక్తులకు ప్రభుత్వం ఫ్రీ సర్వీసు వర్తింప చేసేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని మహిళా భక్తులు కోరుతున్నారు.

విద్యార్థినులకు ఊరట..

కాలేజీలకు వెళ్లే విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలకొకసారి రూ.605 చెల్లించి ఆర్టీసీ నుంచి బస్ పాస్‌లు తీసుకునే వార మని.. ఉచిత బస్సు ప్రయాణ నిర్ణయం వల్ల ప్రయోజనం చేకూరిందని వేమగిరికి చెందిన విద్యార్థినులు నిహారిక, రేష్మ, సంధ్య, ధవళేశ్వ రానికి చెందిన సాహితీ తెలిపారు. తూర్పుగోనగూడెంకు చెందిన తోట సత్యవతి, కండిక బుల్లెమ్మ, టి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ తాము నెలకోసారి ఇస్కాన్ టెంపుల్‌కు వస్తామని.బస్సు టికెట్ రూ.30 ఉందని, ఆటో రూ.40 తీసుకునేవారని చెప్పారు. ఇవాళ ఉచితంగా ప్రయాణించామని, చాలా సంతోషంగా ఉందన్నారు. కొందరు ఉద్యోగులు మాత్రం నెలకు రూ.3 నుంచి రూ.4 వేలు ఖర్చు అయ్యేదని..అది ఇవాళ మిగిలినట్టేనని ఆయా ఉద్యోగులు చెప్పడం గమనార్హం.

గుర్తింపుకార్డుల్లేక..

రాజోలు నుంచి రాజమహేంద్రవరం వచ్చిన ప్రయాణికుల్లో ఎక్కువ మంది ఉచిత ప్రయాణం చేశారని ఒక కండక్టర్ తెలిపారు. 10 మంది గుర్తింపు కార్డుల్లేక టికెట్లు తీసుకున్నారని.. వారికి తాము ఉచిత ప్రయాణం గురించి వివరించామన్నా రు.ఇటువంటి పరిస్థితి అన్ని రూట్లలో కనిపించింది.

గుర్తింపుకార్డు జిరాక్స్ ఉన్నా ఓకే : వైఎస్ఎన్

రాజమహేంద్రవరం అర్బన్,ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోజూ సుమారు 32వేల మంది ప్రయాణిస్తుంటారని, అందులో మహిళలే అధికంగా ఉంటారని ఆర్టీసీ జిల్లా అధికారి ఏలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆధార్, ఓటరు, రేషన్ కార్డులను నేరుగా తేలేకపోయినా డిజిటల్, జిరాక్స్‌లు చూపించినా అనుమతిస్తామన్నారు. టిక్కెట్లు జారీ చేసే టిమ్స్ మెషీన్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉమెన్ ఫ్రీ టికెట్ (డబ్ల్యుఎఫ్‌టీ) బటన్‌పై సిబ్బందికి శనివారం ప్రత్యేక అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టిక్కెట్లు జారీ చేసే కండక్టర్, డ్రైవర్లతో ప్రత్యేకంగా మాట్లాడారు.



టిమ్స్ మిషన్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ జిల్లా అధికారి



నేడో..రేపో!

- డీఎస్సీ మెరిట్ జాబితా ఛాన్స్
- 18న పక్కా అంటూ ప్రచారం
- సర్టిఫికెట్ల పరిశీలన బృందాలు
- ఉమ్మడి జిల్లా పోస్టులు 1241
- పరీక్షలు రాసింది 38,617

మెగా డీఎస్సీ మెరిట్ జాబితా, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షెడ్యూల్ ఎప్పుడు విడుదలవుతుందా? అని అభ్యర్థులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఫలితాలకు సంబంధించి ప్రాథమిక, ఫైనల్ కీ విడుదలైనా మెరిట్ జాబితా విడుదలపై అభ్యర్థులు ఆత్రుతగా ఉన్నారు. వాస్తవానికి ప్రభుత్వం శనివారం (16) నుంచి విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని ప్రకటించినా.. నార్మలైజేషన్ ప్రక్రియ, టెట్ మార్కుల వెరిఫికేషన్ ప్రక్రియతో ఆలస్యం అవుతోందని భావిస్తున్నారు. ఓ పక్క మెరిట్‌లిస్టు నేడో, రేపో విడుదల అవుతోందంటూ సోషల్‌మీడియాలో కొందరు వైరల్ చేస్తుంటే.. మరోపక్క జిల్లాల వారీగా వాట్సాప్ గ్రూపుల్లో ఆయా కేటగిరీల వారీగా తమ మార్కులను బేరీజు వేసుకునే పనిలో బిజీగా ఉన్నారు.
- (కాకినాడ - ఆంధ్రజ్యోతి)

- వివరాలు 7లో



బడికి పోదాం!

బడిబాట పట్టిన చిన్నారులు

- సత్ఫలితాలను ఇస్తున్న సంస్కరణలు
- నిండుగా ప్రభుత్వ పాఠశాలలు
- జిల్లాలో మొత్తం 1544 పాఠశాలలు
- పెరిగిన విద్యార్థుల సంఖ్య 1043
- ప్రైవేటు పాఠశాలల్లో 1287 తరుగుదల



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)
ప్రభుత్వ బడుల్లో తరగతి గదులు కళకళలా డుతున్నాయి. గతేడాది కంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగ్గా ప్రైవేటు పాఠ శాలల్లో తరుగుదల నమోదుకావడం ఇందుకు నిదర్శనం. మరోవైపు టీచర్స్, పేరెంట్స్ మేగా మీట్ పేరుతో నిర్వహిస్తున్న బడి పండుగ సత్ఫలితాలనిస్తోంది. నాడు.. బడులకు రంగులు వేస్తున్నామంటూ వైసీపీ నేతలు మేసేశారు. ట్యాబ్‌లు, యాప్‌లంటూ బోధన కకావికలం చేశారు.నేడు.. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యా మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ చూపిస్తూ ప్రక్షాళన మొదలుపెట్టారు. పాఠశాలల్లో మార్పులు తీసుకొచ్చి బోధనలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

నాడు జీరో.. నేడు ఫుల్

గత వైసీపీ ప్రభుత్వంలో అటు ఉపాధ్యా యులకు బోధనకు సమయం లేక పోగా.. ఇటు విద్యార్థుల చదువు అటకెక్కింది. సీబీఎస్‌సీ, ఐబీ అంటూ రోజుకో సిలబస్, ట్యాబ్‌లు, ఫ్లాట్ ప్యానెళ్ల ఇలా ప్రచార ఆర్భాటానికి విద్యా వ్యవస్థను అవస్థల్లోకి నెట్టేశారు. పిల్లల్లో అభ్యసనా సామర్థ్యం అడుగంటే దుస్థితికి చేరుకొంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రేపటి పౌరుల బంగారు భవిత కోసం విద్యారంగాన్ని గాడిలో పెట్టే పని మొదలుపెట్టింది. విద్యా మంత్రిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచే నారా లోకేశ్ విద్యను గాడిలో పెట్టడంపై ప్రత్యేక దృష్టి సారించారు.ఆ మేరకు ప్రతి పాఠశాలలోని, ప్రతి విద్యార్థిపై దృష్టి సారించారు. పాఠశాలల్లో యాప్‌ల గోల తగ్గించారు. బోధనా సమయాన్ని పెంచారు. విద్యార్థి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు/సంరక్షకులు కూర్చుని విద్యార్థి భవిష్యత్తు, బడి అభివృద్ధే లక్ష్యంగా స్నేహ పూర్వకంగా చర్చించడానికి ఏడాదికి ఒకసారి పేరెంట్స్ టీచర్స్ మెగా మీట్ అంటూ చక్కటి వేది క ఏర్పాటు చేసింది. దీనివల్ల పాఠశాలలకు పాలకులు ఇస్తున్న నిధులు, చేస్తున్న అభివృద్ధి, చదువుకోవడానికి కల్పిస్తున్న వాతావరణం వంటి వాటిని పారదర్శకంగా ఉంచడానికి వీలు కలిగింది. విద్యార్థి వాస్తవ పరిస్థితి తల్లిదండ్రులకు తెలియడం, వాడిని తీర్చిదిద్దడానికి ఉన్న మార్గాలు చర్చించుకోవడం జరుగుతోంది. ఈ ఏడాది జిల్లాలో 976 ప్రభుత్వ, 568 ప్రైవేటు, 120 ఇంటర్మీడియట్ కళాశాలల్లోని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు తదితరులు సుమారు 3 లక్షల మంది వేడుకలకు హాజర య్యారు. గతేడాది ప్రభుత్వ పాఠశా లల్లో మాత్రమే నిర్వహించిన ఈ వేడుక లను ఈసారి ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీ డియెట్ కళాశాలలకు విస్తరించారు.

ఇవిగో లెక్కలు

మండలం	ప్రభుత్వ	ప్రైవేటు	24-25	25-26
అనపర్తి	3778	3817	4355	4326
బిక్కవోలు	3117	3254	2880	2687
చాగల్లు	2866	2879	3579	3368
దేవరపల్లి	4759	4751	6460	6326
గోకవరం	5580	5600	3959	4005
గోపాలపురం	4832	5031	3271	2918
కడియం	4353	4372	5859	5886
కోరుకొండ	5391	5428	6700	6265
కొవ్వూరు	4987	5133	8314	8055
నల్లజర్ల	4519	4532	7615	7778
నిడదవోలు	5243	5284	8489	8112
పెరవలి	2655	2672	4697	4875
రాజమండ్రి	7894	7989	23767	24824
రాజమండ్రి(రూ)	11389	11593	37105	36675
రాజానగరం	5342	5218	10958	11078
రంగంపేట	3305	3336	2710	2536
సీతానగరం	3830	3803	4556	4348
తాళ్లపూడి	2746	2853	2942	2994
ఉండ్రాజవరం	3034	3118	5446	5328
	89620	90663	153672	152385

1043 మంది పెరుగుదల

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి పదో తరగతి వరకూ గతేడాది 89620 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది ఆ సంఖ్య 90663కి చేరడంతో 1043 పెరుగుదల నమోదైంది.దాదాపుగా ప్రతి మండలంలోని విద్యార్థుల సంఖ్య పెరిగింది. అదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో గత ఏడాది 153672 మంది విద్యార్థులుండగా ఈ ఏడాది 1287 మంది తరుగుదలతో 152385తో సరిపెట్టుకున్నాయి.



ముంచిన వాన

తాళ్లపూడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నిన్నటి వరకూ వానల్లేవ్..వానల్లేవ్ అనుకున్నారంతా.. వరుణుడు వచ్చాడు.. ప్రతి రోజూ ఏదో ప్రాంతంలో దంచికొడుతున్నాడు.. లోతట్టు ప్రాంతాలను ముంచుతున్నాడు.తాళ్లపూడి, రాజమహేంద్రవరం తదితర మండలాల్లో శనివారం పెద్ద ఎత్తున వర్షం పడింది.దీంతో తాళ్లపూడి, వేగేశ్వరపురం, గజ్జరం తదితర గ్రామాల్లో వర్షం నీటితో రహదారులు సైతం మునిగిపోయాయి. రాజమహేంద్రవరంలో హైటెక్ బస్టాండ్ ఆవరణ చెరువులా మారింది. వేగేశ్వరపురం గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయం నీటితో నిండిపోయింది.



అన్నదాతల ఆనందం

అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీని కోరుకొండలో శనివారం నిర్వహించారు. సుమారు 500 ట్రాక్టర్లపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి తదితరుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. రైతులు జై చంద్రబాబు నినాదాలతో హోరెత్తించారు.

అంబయ్యా.. అదిరిందయ్యా!



- జాజికాయ, జాపత్రి సాగులో రాణిస్తున్న యండపల్లి రైతు
- సుమారు పదేళ్ల క్రితం అంతరపంటగా సాగు..
- నేడు ఏపుగా కాపు కాస్తున్న కాయలు..
- స్థానిక వ్యాపారులకు విక్రయం

(కాకినాడ, యు.కొత్తపల్లి-ఆంధ్రజ్యోతి)

జాజికాయ, జాపత్రి మార్కెట్లో డిమాండ్ ఉన్న ఐటమ్.. కేరళలో మాత్రమే కనిపించే ఈ పంటను.. మన కాకినాడ జిల్లాలోనూ ఓ రైతు సుమారు పదేళ్లుగా అంతరపంటగా సాగుచేస్తున్నారు. ఆయన వేసిన పంట ఆశాజనకమైన దిగుబడి ఇస్తుండడంతో ఆయన ప్రయత్నం ఫలప్రదమైందని చెప్పొచ్చు. ఈనేపథ్యంలో ఆయనపై ఆంధ్రజ్యోతి ఆదివారం ప్రత్యేకకథనం..

తనకున్న భూమిలో ఆ రైతు అరటి సాగు వేసేవారు.. అరటి తోటలు తుఫాన్లకు, ఈదురు గాలులకు దెబ్బతిని కూలిపోతుండడంతో నష్టం వాటిల్లేది. ఇక లాభం లేదనుకున్న ఆయన పామాయిల్ సాగుపై మొగ్గుచూపారు. చెట్లు పెద్దగా పెరగడంతో అంతరపంటగా కోకో వేశారు. ఆ పంటను కోతులు పాడు చేస్తుండడంతో ఆ పంటను కూడా విరమించుకున్నారు. ఓ రోజు పశ్చిమగోదావరి జిల్లాలోని ఓ రైతు జాజికాయ, జాపత్రిని అంతరపంటగా వేశారని తెలిసి చూసేందుకు వెళ్లారు. అక్కడ చెట్లు ఏపుగా పెరిగి కాయలు కాస్తుండడాన్ని గమనించి కడియపులంకలో జాజి మొక్కను వేశారు. అది కాస్తా ఫలప్రదం కావడంతో తనకున్న 20 ఎకరాల్లో అరుదైన జాజికాయ, జాపత్రిని సాగు చేస్తున్నారాయన. వాస్తవానికి ఒకే చెట్టు కాయ నుంచి జాజికాయ, జాపత్రి వస్తాయి. మార్కెట్లో వీటికి డిమాండ్ ఎక్కువ.

అరటిలో నష్టంరావడంతో...

కాకినాడజిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం యండపల్లి గ్రామానికి చెందిన గంధ్ర అంబయ్య 20 ఎకరాల ఆసామి.. వివిధ రకాల పంటలను సాగు చేస్తుంటారు. ప్రధాన పంటగా ప్రస్తుతం ఆయన పామాయిల్ సాగు చేస్తున్నారు. మొదట్లో ఆయన అరటి పంట వేయగా.. అది తుఫాన్లకు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయేది. దీంతో నష్టాలబారిన పడిన ఆయన తర్వాత పామాయిల్ సాగు వేశారు. పామాయిల్ చెట్ల మధ్య ఖాళీలో అంతరపంటగా కోకో వేసినా.. ఆ పంటను కోతులు పాడుచేసేవి. దీంతో ఆయన జాజికాయ, జాపత్రిలను వేశారు.

అంతరపంటగా జాజికాయ సాగు

సాధారణంగా ఈ పంట మనప్రాంత భూముల్లో పండడం అరుదు. ఎక్కువగా కేరళ వంటి చల్లదనం ఉన్న ప్రాంతాల్లో పండుతాయి. ఈ నేపథ్యంలో 2016లో తొలుత కడియపులంక నుంచి దేశివాళీ జాజికాయ మొక్కలు ధర రూ.200 చొప్పున కొనుగోలు చేసి అంబయ్య తన తోటలో నాటారు. ఆ మొక్కలు ఏపుగా పెరుగుతుండడంతో.. నేల అనుకూలంగా ఉందని భావించిన ఆయన మరికొన్ని హైబ్రీడ్ మొక్కలను మొక్క ఒక్కొక్కటి రూ.400 చొప్పున కేరళ నుంచి రప్పించారు. ముందుగా వేసిన దేశీవాళీ మొక్కలు ఆరేళ్లకే కాపునకు రాగా, రెండేళ్ల తర్వాత వేసిన హైబ్రీడ్ మొక్కలు నాలుగేళ్లకే కాపు కొచ్చాయి. రెండూ ఒకేసారి కాపునకు రావడంతో రైతు అంబయ్య పంట పండింది. ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే దేశీవాళీ మొక్క పదడుగుల ఎత్తు ఎదిగాక కాపుకొస్తే.. హైబ్రీడ్ మొక్క నాలుగైదు అడుగుల ఎత్తులోనే కాయలు కాసేవి. తొలుత దేశీవాళీ మొక్కలు 10, హైబ్రీడ్ మొక్కలు ఆరు తీసుకొచ్చిన అంబయ్య ప్రస్తుతం వందలాది మొక్కలను నాటారు. ఒక మొక్క పూర్తిస్థాయిలో ఫలాలను అందించాలంటే పదేళ్ల సమయం పడుతుందని రైతు అంబయ్య అంటున్నారు. దేశీవాళీ కాయ సైజు చిన్నగా, హైబ్రీడ్ పెద్దగా ఉంటున్నాయంటున్నారు. అలాగే దేశవాళీ దిగుబడి అధికంగా ఉంటే, హైబ్రీడ్‌లో కాయల దిగుబడి తక్కువగా ఉంటుందన్నారు.



నీడనిచ్చే వాతావరణం..

సాధారణంగా ఈ జాజికాయ, జాపత్రి పంటను నీడన మాత్రమే వేసుకోవాలి. 30 డిగ్రీల వాతావరణంలో తోట పంటలుగా వేస్తేనే మొక్కలు బాగా ఎదుగుతాయి. లేకుంటే చనిపోతాయి. అలాగే పామాయిల్‌తోపాటు కొబ్బరిలో అంతరపంటగానూ వేసుకోవచ్చు. రెగ్యులర్‌గా నీటితడులు ఇచ్చుకుంటే సరిపోతుంది.

దిగుబడి ఇలా..

ప్రస్తుతం రైతు అంబయ్య తోటల్లో వేసిన జాజికాయ, జాపత్రిచెట్లు ఒక్కో చెట్టు సుమారు వందకాయలు కాస్తోంది. వీటిలో అనేక రకాల మొక్కలు ఉన్నాయని కేరళలోని రీసెర్చ్ సెంటర్లో కేరళ శ్రీ, విశ్వశ్రీ, నోవా, కింగ్, కౌపుత్రా, పునాపున్ పేరుతో అందుబాటులో ఉంచారని అంటున్నారు. తాను మాత్రం దేశివాళీ, విశ్వశ్రీని తీసుకొచ్చానంటున్నారు. ప్రస్తుతం తన వద్ద పండిన పంటను కిరాణా షాపుల వారికి విక్రయిస్తున్నట్టు రైతు అంబయ్య చెబుతున్నారు. కిలో మేస్(జాపత్రి) ధర రూ.2500కు, జాజికాయలు రూ.వెయ్యి వరకు విక్రయిస్తున్నారు.

ఎందుకు వాడతారంటే..

జాజికాయ అనేది పండు లోపల ఉండే గింజ, జాపత్రి అంటే ఆగింజను కప్పి ఉంచే ఎర్రటి పొర.జాజికాయలను సుగంధ ద్రవ్యంగా ఉపయోగిస్తారు. అలాగే ఆయుర్వేదంలో కూడా పలు అనారోగ్య సమస్యలకు ఔషధంగా వాడతారు. జాజికాయ జీర్ణక్రియను మెరుగుపరచడానికి, నిద్రలేమిని తగ్గించడానికి, కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది.

మిరియాలు, వక్క కూడా..

ప్రస్తుతం రైతు అంబయ్యతోటలో వక్క, మిరియాలు వంటి వాటిని అంతర పంటగా సాగు చేస్తున్నారు. అవి కూడా మరికొన్ని నెలల్లో సాగుకు వచ్చే అవకాశం ఉందని ఆయన చెబుతున్నారు. కేవలం తన సొంత పరిజ్ఞానంతోనే ఈ సాగు చేపట్టానని, ఉద్యానశాఖాధికారుల నుంచి ఎటువంటి సూచనలు తీసుకోలేదని ఆయన తెలిపారు.

సేంద్రియ విధానంలోనే సాగు

- గంధ్ర అంబయ్య, రైతు, యండపల్లి, యు.కొత్తపల్లి



నేను, నాకున్న ఎకరాల్లో వందలాది మొక్కలు వేశాను. పూర్తిగా సేంద్రియ విధానంలోనే సాగు చేస్తున్నాను. పంట పూర్తి లాభదాయకంగానే ఉంది. పామాయిల్ తోటల్లో మూడు చెట్లకు మధ్యలో మొక్కలు నాటితే దిగుబడి బాగుంటుంది. మొక్కకి మొక్కకి మధ్య 20 అడుగుల దూరం ఉండాలి. ఎకరానికి 50 మొక్కలు వేశాను. ఈ మొక్క సుమారు వందేళ్ల పాటు బతుకుతుంది. పదేళ్ల తర్వాత దిగుబడి అధికమవుతుంది. ఈమొక్కల్లో మేల్, ఫిమేల్ రెండూ ఉన్నాయి. మెడిసిన్ ప్లాంట్ కావడంతో తెగుళ్ల బెడద పెద్దగా ఉండదు. మిగిలిన పంట కంటే వీటి ద్వారా ఆదాయం బాగుంది.

ముకుందా..ముకుందా!

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

రాజమహేంద్రవరంకల్చరల్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమిఘాట్‌లో ఉన్న ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం యజ్ఞసేవ, మధ్యాహ్నం ఇస్కాన్ నిర్వహించిన పోటీలో గెలుపొందిన 300మంది విద్యార్థులకు జర్మనీ దేశం నుంచి వచ్చిన శ్రీకృష్ణ భక్తుడు సనత్‌నాధన్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మధ్యాహ్నం ఉట్టి ఉత్సవం,సాయంత్రం విశ్వశాంతి యజ్ఞం, వాహన సేవలు, శ్రీకృష్ణ లీలా ప్రవచనాలు, తెప్పోత్సవం, రాత్రి కుంభాభిషేకం జరిగింది. 2006లో సరిగ్గా బలరామ జయంతినాడు, రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరాన్ని ప్రారంభించామని రవీంద్ర చైతన్య హిమా నిమాయిదాస్ తెలిపారు.



రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు





రాజమహేంద్రవరంలోని ఇస్కాన్ మందిరం వద్ద ఉట్టికొడుతున్న దృశ్యం, అమలాపురంలోని ఓ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు

సత్యదేవుడి సన్నిధిలో..

అన్నవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కళామందిరంలో స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులనుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకస్వాములు గోపూజ శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈవో సుబ్బారావు దంపతులతోపాటుగా అధిక సంఖ్యలో భక్తులు గోపూజలో పాల్గొన్నారు. శ్రీగోకులంలో ఉన్న కృష్ణభగవానుడికి విశేషపూజలు నిర్వహించారు. రాత్రి 8గంటలకు కొండపై రామాలయం, తొలిపావంచావద్ద యాదవసామాజిక వర్గం ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమంనిర్వహించారు.



అన్నవరం ఆలయప్రాంగణంలో ఉట్టికొడుతున్న భక్తులు



కాజులూరు మండలం గొల్లపాలెంలో ఉట్టికొడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్



శ్రీకృష్ణుడు వేషధారణలో చిన్నారులు



వెన్న కోసం ఉరకలేస్తున్న బాలుడు

గోదావరి తీరాన మార్మోగిన శ్రీహరినామ సంకీర్తన

పి.గన్నవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీపట్టాభి రామస్వామి ఆలయ సన్నిధిలో గరుడవేగ టీమ్, రామసేతు భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై శ్రీపట్టాభిరామస్వామి ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపానికి తీసుకుని వచ్చారు. మహిళలు పసుపు, చందనంతో కలశపాత్రలో తీసుకువచ్చిన జలాలను స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకపూజలు అనంతరం శ్రీశ్రీశ్రీ సాయిదత్త నాగానంద సరస్వతి స్వామి భక్తులకు ప్రవచనాలను వినిపించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు.



పిగన్నవరంలో లడ్డూగోపాలుడు, రాధాకృష్ణుడు, సుదర్శనమూర్తికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.62.78లక్షలు



వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువ జామునే స్వామి వారికి సుప్రభాత సేవ,నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామివారిని దర్శించుకుని తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి శనివారం ఒక్కరోజు ఆదాయం రూ.62.78 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ఆలయ తిరువీధుల్లో భక్తుల రద్దీ

ఉధృతమవుతున్న గోదావరి

4.25 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద నీటి ప్రవాహం

ధవళేశ్వరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రవాహంలో కురుస్తున్న వర్షాల వల్ల ఉప నదులు ప్రాణహిత, ఇంద్రావతి నుంచి వరద ప్రవాహం వస్తుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువు నుంచి వస్తున్న వరద ప్రవాహంతో ధవళేశ్వరం వద్ద 24గంటల వ్యవధిలో 1.75 లక్షల క్యూసెక్కులకు పైగా వరద పెరిగింది.శనివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, ర్యాలీ, మద్దూరు ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 1మీటరు మేర, విజ్జేశ్వర ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను అరమీటరు మేర పైకెత్తి 4,25,5 94 క్యూసెక్కులను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదలను మరింత తగ్గించారు. తూర్పు డెల్టాకు 2వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 200 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 500క్యూసెక్కులు చొప్పున మొత్తం 2700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం శనివారం సాయంత్రానికి 29.60 అడుగులకు చేరుకుంది.

ప్రభుత్వ బడి చిన్నారులు.. ఆంగ్లంలో దిట్టలు



ఆంగ్లంలో ప్రసంగిస్తున్న భావనరాజి, సుహాన

సామర్లకోట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంచాల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ముమ్మిడి భావనరాజి, ఈది సుహానాలు కలిసి చేసిన ఆంగ్ల ప్రసంగం పలువురు ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఆకట్టుకుంది. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా రెండున్నర నిమిషాల పాటు గుక్క తిప్పుకోకుండా ఇద్దరూ ఆంగ్లంలో ప్రసంగించారు. స్వాతంత్ర్య దినోత్సవం, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యామిత్ర కిట్‌ల పంపిణీ, ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును ఈ సందర్భంగా వివరించారు. కాగా చిన్నారులకు ఆ రీతిలో ఆంగ్లంలో ప్రసంగం చేసేలా శిక్షణ ఇచ్చేందుకు మార్గదర్శకులైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఎస్ఎన్ మూర్తిని పలువురు గ్రామస్థులు అభినందించారు.



ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా
సానా సతీష్‌బాబు ఏకగ్రీవం

కాకినాడసిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శిగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరుసగా రెండోసారి ఎన్నికైన ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు శనివారం మంగళగిరిలో రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ నియామకపత్రం అందజేశారు.సతీష్‌బాబును బీసీసీఐ కార్యదర్శి జయ్ షా ప్రత్యేకంగా అభినందించారు.అలాగే ఆయనను ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, చింతపల్లి అర్జున్, క్రికెట్ అభిమానులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

మందపల్లి శనేశ్వరస్వామికి
ప్రత్యేక పూజలు

కొత్తపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు.ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,91,581 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.

ఉత్కంఠభరితంగా
బాస్కెట్‌బాల్ పోటీలు



పిఠాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్న 10వ రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు మూడో రోజు శనివారం ఉత్కంఠభరింతంగా జరిగాయి. బాలబాలికల విభాగాల్లో సెమీఫైనల్స్‌లో బెర్త్ కోసం 13 ఉమ్మడి జిల్లా జట్లు మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు భారీగా వచ్చారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమ్యూనిస్టు ఉద్యమం పునరేకీకరణ జరగాలి

- పేదరికం తగ్గితే కోట్ల మందికి ఉచిత బియ్యం పంపిణీ ఎందుకు?
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టుల చీలిక వల్ల రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే తీవ్రంగా నష్టపోయాం, ఈ నేపథ్యంలో కమ్యూనిస్టులు మరింత సమర్థవంతంగా, సమరశీలంగా పనిచేయాలంటే కమ్యూనిస్టు ఉద్యమం పునరేకీకరణ జరగాలని పిలుపునిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. దేశంలో ప్రధానమైన కమ్యూనిస్టు పార్టీలు సీపీఐ, సీపీఎం మరింత ఐక్యతతో ముందుకు సాగాలని అనుకుంటున్నామని వ్యాఖ్యానించారు. శనివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 25శాతం పేదరికం తగ్గించామని ప్రధాని నరేంద్రమోదీ గొప్పగా చెప్పుకుంటున్నారని, ఒక వేళ దేశంలో అంత పేదరికమే తగ్గితే ఉచితంగా అన్ని కోట్ల మందికి బియ్యం, గోధుమలు వంటివి ఎందుకిస్తున్నారని రామకృష్ణ ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వంలో అదానీ, అంబానీలు, కోటీశ్వరులను పోషిస్తున్నారు తప్ప పేదరికం తగ్గలేదని, వారి జీవన ప్రమాణాలు పెరగలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను మోసం చేస్తున్నాయని, పోలవరం సమస్యలపై దశల వారీ ఉద్యమం చేస్తామన్నారు. పోలవరం ఎత్తు తగ్గిస్తామని మోదీ చెబుతుంటే దానికి సీఎం చంద్రబాబు మాట్లాడకపోవడం ఏమిటని అన్నారు. తాము ప్రస్తుతం పేద, బలహీన వర్గాల వారికి ఇళ్ల స్థలాల కోసం ఉద్యమిస్తున్నామన్నారు. మోదీ, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను నట్టేట ముంచారని, ఎవరికి ఉద్యోగాలిచ్చిన పాపాన పోలేదన్నారు. నిరుద్యోగభృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ సంపూర్ణంగా అమలు చేయకపోతే తాము ఉద్యమించకతప్పదని అన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, కె.రాంబాబు, వి.కొండలరావు, సప్ప రమణ, పి.లావణ్య, అల్లం వెంకటేశ్వరరావు, సీహెచ్ సునీల్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

- లేకుంటే ఉద్యమిస్తాం
- సీపీఎం పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి బేబీ
- పోలవరం నిర్వాసిత ముంపు ప్రాంతాల్లో పర్యటన



ఇందుకూరు సభలో మాట్లాడుతున్న ఎంఏ బేబీ

దేవీపట్నం/కూనవరం/కోరుకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల కోసం నిర్మించిన పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించలేదని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సీపీఎం పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ హెచ్చరించారు. శనివారం పోలవరం నిర్వాసిత ప్రాంతాల్లో పర్యటించేందుకు వచ్చిన ఆయన తొలుత మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు కేంద్ర కమిటీ సభ్యుడు బి.లోకనాథం, సీపీఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి బి.కిరణ్ ఇతర నాయకులు స్వాగతం పలికారు. అక్కడ ఆయన గిరిజన సాంప్రదాయంలో భాగమైన కొమ్మును బేబీ తలపై ధరించారు. అనంతరం కొద్దిసేపు నాయకులతో మాట్లాడి అక్కడ నుంచి దేవీపట్నం బయల్దేరారు. తాళ్లూరు, నాగులపల్లి పునరావస కాలనీలో పర్యటించారు. అనంతరం ఇందుకూరు వన్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు.పోలవరం ప్రాజెక్టు కారణంగా వేల కుటుంబాలు మునిగిపోతున్నాయన్నారు. నిర్వాసితుల్లో 85శాతం మంది ఆదివాసీలు ఉన్నారన్నారు. పోలవరం నిర్వాసితులందరికీ గౌరవప్రదమైన పునరావాసం కల్పించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వంపై ఉందని, కానీ సుదీర్ఘకాలంగా పూర్తి నిర్లక్ష్యం జరిగినట్టు స్పష్టమవుతోంది. నిర్మాణాల్లో నాణ్యత లోపం కారణంగా వర్షాలకు శ్లాబుల నుంచి నీళ్లు కారిపోతున్నాయని, మరుగుదొడ్లు కూడా సక్రమంగా నిర్మించలేదని, తాగునీటి సౌకర్యం పూర్తిస్థాయిలో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు.ఉపాధి కోసం ప్రతిరోజు 30 నుంచి 40 కిలోమీటర్లు నడకన వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ నిర్మించినా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాలేదన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాస గృహాలకు అర్హులైనవారు సైతం దూరమయ్యారని వివరించారు. వీటిపై ప్రభుత్వం స్పందించాలని బేబీ డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయడంలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను పరిశీలిస్తామని ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. ప్రజల సమస్యలు విన్నవించుకునేందుకు నోడల్ అధికారి సైతం అందుబాటులో లేరని విమర్శించారు.

జెండాలు పీకేస్తాం

అఖిలపక్షం నాయకులు

కూనవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం పరిహారం తీసుకున్న రైతుల భూములలో పాతిన జెండాలను అధికారులతో పీకిచ్చేస్తామని అఖిలపక్షం నాయకులు అన్నారు. పరిహారం తీసుకుని స్థానికంగా లేని కొంతమంది రైతుల భూములను పేద గిరిజనులకు పంచుతామని ఇటీవల సీపీఎం గిరిజన సంఘం ఆ భూముల్లో జెండాలు పాతిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక సినిమా హాల్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు పాయం వెంకయ్య మాట్లాడుతూ సీపీఎం పార్టీ గిరిజనులకు గిరిజన నేతరులకు మధ్య వివాదం సృష్టిస్తోందన్నారు. నీళ్లు వచ్చేంతవరకు భూమి గల రైతులు వ్యవసాయం చేసుకోవచ్చని అప్పటి ప్రభుత్వం పరిహారం ఇచ్చినప్పుడు చెప్పిందని.. ఆ భూములను లాక్కోవడానికి సీపీఎంకు ఏమి హక్కు ఉందని ప్రశ్నించారు. టీడీపీ అరకు పార్లమెంట్ ప్రతినిధి ఎడపల్లి భాస్కరరావు మాట్లాడుతూ ఈ విషయాన్ని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. అవసరమైతే ఆదివారం పర్యటించే సీపీఎం కేంద్ర కమిటీతో అక్కడి రైతులు మాట్లాడి సమస్య పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఒకరి భూములు మరొకరు లాక్కోవడం చట్ట విరుద్ధమన్నారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు గడేసుల ప్రేమ్‌చంద్, బీజేపీ చింతూరు నాయకుడు దాసరి రమణరెడ్డి, వైసీపీ నాయకులు మాదిరెడ్డి సత్తిబాబు, ఆవుల మరియదాసు, ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంజ అనిల్ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడో.. రేపో..!

- మెగా డీఎస్సీ మెరిట్ జాబితా విడుదలయ్యే అవకాశం
- అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు బృందాల ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం టీచర్ పోస్టులు 1241
- పరీక్షలు రాసింది 38,617 మంది

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

మెగా డీఎస్సీ ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారికి కూటమి సర్కారు శుభవార్త వినిపించినా.. తుది ఫలితాల విడుదల్లో జాప్యంపై గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈనెల ఒకటో తేదీన కీ విడుదల చేసిన విద్యాశాఖ ఈనెల 15లోపు మెగా డీఎస్సీ-2025 ఫలితాలను విడుదల చేస్తామని ఆరోజే ప్రకటించింది. దీంతో డీఎస్సీ అభ్యర్థుల్లో ఆనందం నెలకొంది. ఇప్పటికే కీ పరిశీలనతో ఓ నిర్ణయానికి వచ్చిన అభ్యర్థులు మెరిట్ జాబితా కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. 16 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన, నెలాఖరునాటికి కొత్త టీచర్ల పోస్టింగులు, శిక్షణ అన్నీ చకచకా జరిగిపోతాయని ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఇంకా ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేయకపోవడంపై నిరాశ చెందుతున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా డీఎస్సీకి ఎక్కువ మంది దరఖాస్తు చేశారు. అన్ని మేనేజ్‌మెంట్లకు కలిపి 1241 పోస్టులు ఉండగా 63,004 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో పోస్టుకు సగటున 50 దరఖాస్తులు రావడంతో అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అయితే ఈసారి పురుషుల కన్నా మహిళలే దరఖాస్తు నమోదులో ముందున్నారు. కేటగిరీల వారీగా ఓసీ-5120, బీసీ-ఏ 2810, బీసీ-బీ 6991, బీసీ-సీ 554, బీసీ-డీ 3636, బీసీ-ఈ 568, ఎస్సీ గ్రేడ్-1 87, ఎస్సీ గ్రేడ్-2 2572, ఎస్సీ గ్రేడ్-3 10,066, ఎస్టీ 6,213, ఈడబ్ల్యూఎస్ 3,782, అలాగే దివ్యాంగుల కేటగిరీ నుంచి వీహెచ్ 159, హెచ్‌హెచ్ 36, ఓహెచ్ 847, ఎంఐ ఆరుగురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. జూన్ ఆరు నుంచి జూలై ఏడు వరకు 26 రోజుల పాటు పరీక్షలు నిర్వహించారు.

పోస్టుల వివరాలు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1241 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ 608, పీఈటీలు 210, ఎస్జీటీ 423 పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తెలుగు 65, హిందీ 78, ఆంగ్లం 95, గణితం 64, ఫిజికల్ సైన్స్ 71, బయోలాజికల్ సైన్స్ 103, సోషల్ 132, వ్యాయామవిద్య 210 ఉద్యోగాలతో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ల ఉద్యోగాలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమానికి సంబంధించి ఫిజికల్ సైన్స్ 3, బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య 1, ఎస్జీటీలు 104 మొత్తం 112 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 13 టీజీటీలు, 3 పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి 31 పోస్టులు ఉన్నాయి. జోన్-2 (ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా)కు సంబంధించి ఏపీఆర్ఎస్, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూ, బీసీ, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీఈటీ 24తో కలిపి మొత్తం 348 ఉపాధ్యాయపోస్టులు భర్తీ చేయనున్నారు.

జాప్యానికి కారణాలు...

మెరిట్ జాబితా విడుదల్లో జాప్యానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. టెట్ మార్కులను కొందరు అభ్యర్థులు తప్పులతడకలుగా పొందుపరచడం, నార్మలైజేషన్ ప్రక్రియలు, న్యాయస్థానాల్లో ఉన్న అభ్యంతరాలను అధిగమించడం, వరుస సెలవుదినాలు రావడం వంటి పలు కారణాలతో విడుదల ఆలస్యమవుతోందనే ప్రచారం సాగుతోంది. టెట్ మార్కులపై అభ్యంతరాలను స్వీకరించి మారిన మార్కులతో సవరించిన డీఎస్సీ తుది మార్కుల స్కోర్ కార్డులను ఈనెల 14న విడుదల చేశారు. ఏపీ డీఎస్సీ వెబ్‌సైట్‌లో మార్కులు ఉంచారు. ఇంకా టెట్ మార్కులపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఆన్‌లైన్‌లో పంపవచ్చని సూచించారు. అలా వచ్చిన వాటిని పరిశీలించి తుది మెరిట్ జాబితాను ప్రకటించనున్నారు. అయితే ఈనెల 18 నాటికి విడుదలయ్యే సూచనలు అధికంగా కనిపిస్తున్నాయి. అనంతరం మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో టీచర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జిల్లాలో డీఎస్సీ పోస్టులకు సంబంధించి అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయరాజు ఆదేశించారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రతి 50 మందికి ఒక బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. కాకినాడ జిల్లాలో 25 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో ఒక ఎంఈఓ, హెచ్ఎం, డిప్యూటీ తహశీల్దార్ ఉండేలా చూశారు.

ఆ వివరాలు పంపండి..

డీఎస్సీ 2025లో నోటిఫై చేయబడిన పోస్టుల సంఖ్య, మేనేజ్‌మెంట్ వారీగా, కేటగిరీ వారీగా, మీడియం, సబ్జెక్టుల వారీగా వివరాలు పంపాలని ఇప్పటికే డీఈవో, ఆర్జేడీలకు ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిసింది. ఆగస్టు 31, 2025 నాటికి అందుబాటులో ఉన్న ఖాళీల సంఖ్య, డీఎస్సీ 2025లో ఖాళీలను భర్తీ చేయడానికి పాఠశాలలను గుర్తించడం, కేటగిరీ-4/3లో ఉపాధ్యాయులు లేని పాఠశాలలు, బదిలీ చేయబడిన కానీ, బదిలీ చేసిన, రిలీవ్ కాని ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలు, ఇలా పలు వివరాలు పంపాలని పాఠశాల విద్య డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు అందినట్టు చెబుతున్నారు.

ఈ సారి పోటీ అధికమే..

డీఎస్సీకి ఈసారి పోటీ అధికంగానే ఉంది. ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ శిక్షణ పొందిన వారు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు బీఎడ్ శిక్షణ పొందిన వారు అర్హులు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు కూడా పోటీ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 వేల నుంచి 40 వేలమంది పోటీ పడనున్నారు. 2018 డీఎస్సీలో ఒక పోస్టుకు 101 మంది పోటీపడ్డారు. ఎస్జీటీలో ఒక్కో ఖాళీకి 101 మంది పోటీపడగా, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఒక్కో పోస్టుకు 124మంది పోటీపడ్డారు. స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ పోస్టుల్లో ఒక్కో పోస్టుకు 94 మంది పోటీపడ్డారు. ఆ లెక్కన చూస్తే ప్రస్తుత డీఎస్సీలో పోటీ అధికంగానే ఉందని భావిస్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ఉచిత బస్సు ప్రారంభం



ఉచిత బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

అన్నవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల నుంచి సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులకు రత్నగిరి నుంచి సత్యగిరి కొండకు చేరుకునేందుకు అరబిందో ఫార్మా అందజేసిన ఉచిత బస్సును శనివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా భక్తుల ఇబ్బందులు తెలుసుకుని వాటిని పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకుముందు ఆమె స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

సముద్రంలోకి పంపా నీరు విడుదల

98 అడుగుల నీటిమట్టం ఉండేలా చూడాలని ఉన్నతాధికారుల ఆదేశం



వరద గేట్ల ద్వారా పంపా జలాలు విడుదల చేస్తున్న దృశ్యం

అన్నవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎగువప్రాంతాల్లో 2 రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంపా రిజర్వాయర్ నీటి మట్టం పెరుగుతుండడంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందుజాగ్రత్త చర్యగా పంపా నీటిని వరదగేట్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేశారు. ప్రస్తుతం నీటిమట్టం 99 అడుగులు ఉండగా 98 అడుగులు నిర్వహణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారని డీఈ సంతోష్‌కుమారు తెలిపారు. ఎగువప్రాంతాల నుంచి 600 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు చేరుతుండగా 600 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

తిరుపతి-విశాఖ మధ్య 14 వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లు



సామర్లకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ-తిరుపతిల మధ్య సామర్లకోట మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు సెప్టెంబరు 25 వరకూ 14 వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపనున్నట్టు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా వెల్లడించారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది. 08547 నంబరు గల రైలు విశాఖ-తిరుపతి మధ్య సెప్టెంబరు 24 వరకూ ప్రతీ బుధవారం విశాఖలో బయలుదేరనుంది. అలాగే 08548 నంబరు గల రైలు తిరుపతి-విశాఖల మధ్య సెప్టెంబరు 25 వరకూ ప్రతీ గురువారం తిరుపతిలో బయలుదేరనుంది. 08547 నంబరు గల ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖలో ప్రతీ బుధవారం రాత్రి 7.35 గంటలకు బయలుదేరుతుంది. అనకాపల్లి, యలమంచలిల మీదుగా అన్నవరం స్టేషన్‌కు రాత్రి 8.38 గంటలకు చేరుతుంది. సామర్లకోటకు రాత్రి 9.08 గంటలకు చేరుతుంది. రాజమహేంద్రవరానికి 9.53 గంటలకు చేరుతుంది. నిడదవోలు, తణుకు, భీమవరం, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంటల మీదుగా తిరుపతికి గురువారం ఉదయం 9.15 గంటలకు చేరుతుంది. ఈ ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు ఆగస్టు 20,27, సెప్టెంబరు 3,10,17,24 తేదీల్లో విశాఖ నుంచి 6 ట్రిప్‌లుగా బయలుదేరుతుంది. 08548 నంబరు గల తిరుపతి-విశాఖల మధ్య వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతిలో ప్రతీ గురువారం రాత్రి 9.50 గంటలకు బయలుదేరుతుంది. రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, కైకలూరు, భీమవరంటౌన్, తణుకు, నిడదవోలుల మీదుగా రాజమహేంద్రవరం స్టేషన్‌కు ఉదయం 6.43 గంటలకు చేరుతుంది. సామర్లకోటకు ఉదయం 7.28 గంటలకు, అన్నవరం స్టేషన్‌కు 7.58 గంటలకు చేరుతుంది. యలమంచలి, అనకాపల్లి, దువ్వాడల మీదుగా విశాఖకు శుక్రవారం మధ్యాహ్నం 11.30 గంటలకు చేరుతుంది. ఈ వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఆగస్టు 21,28 సెప్టెంబరు 4, 11, 18, 25లలో తిరుపతి నుంచి 6 ట్రిప్‌లుగా బయలుదేరుతుంది. ఈ వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో సెకండ్ ఏసీ-2 బోగీలు, థర్డ్ ఏసీ-3 బోగీలు, థర్డ్ ఏసీ ఎకానమి-2 బోగీలు, స్లీపర్ క్లాస్‌కు చెందిన 8 బోగీలు, జనరల్ 4 బోగీలు, ఎస్ఎల్ఆర్‌డీ-1, ఈవోజీ-1 చొప్పున మొత్తం 21 ఎల్‌హెచ్‌బీ బోగీలతో విశాఖ-తిరుపతి-విశాఖల మధ్య రాకపోకలు సాగించనుంది. ఈ రైళ్లల్లో ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కెట్ల కోసం సమీప రైల్వే స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఐ.పోలవరంలో అడవిపంది స్వైరవిహారం

నలుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న వెంకటరాజారావు

ఐ.పోలవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం ఐ.పోలవరం, కేశనకుర్రు గ్రామాల్లో శనివారం అడవిపంది స్వైరవిహారం చేసింది. పలువురిని తీవ్రంగా గాయపరిచింది. గాయపడినవారిలో ఐ.పోలవరానికి చెందిన దంగుడుబియ్యం వెంకటరాజారావు, బొలిశెట్టి రాంబాబు, వ్యవసాయకూలీ గుత్తుల త్రివేణీపద్మావతి, దంగేటి వెంకటరెడ్డి ఉన్నారు. తీవ్రంగా గాయపడిన బాధితులను టి.కొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దంగుడుబియ్యం వెంకటరాజారావుకు కాలు, చెయ్యి విరగడంతో కాకినాడ తరలించారు. కోటిపల్లి తదితర ప్రాంతాల నుంచి ఇటీవల అడవిపందులు గ్రామాల్లోకి చొరబడుతున్నాయని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండుసార్లు మండలంలో అడవిపందులు చొరబడగా హతం చేయడం జరిగిందన్నారు. కాగా శనివారం స్వైరవిహారం చేసిన అడవిపందిని కేశనకుర్రులో హతం చేసినట్టు సమాచారం. అడవిపంది నలుగురిపై దాడి చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మరణించిన రత్నరాజు

కొవ్వూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతిచెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం మట్లపాలెం గ్రామానికి చెందిన బొక్కా రత్నరాజు (45) తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవంలో గోదావరి గట్టుపై ఉన్న గెస్టుహౌస్‌లో పనిచేస్తున్నాడు. శనివారం విద్యుత్‌మోటారును పైకి తీస్తుండగా మోటారు జారి పడి వైర్లపై పడడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవపంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ విభేదాల కారణంగా గత 10 సంవత్సరాలుగా విడిగా ఉంటున్నాడు. మృతుడి అన్న కొడుకు బొక్కా లక్ష్మణ్ అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

అత్తారింటికి వెళ్లొస్తూ తిరిగిరాని లోకాలకు...

లారీ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి



సాయినిరంజన్ (ఫైల్)

ఆలమూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అత్తారింటికి వెళ్లి వస్తూ లారీ ఢీకొని యువకుడి మృతిచెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్ల వద్ద శనివారం జరిగింది. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ కథనం ప్రకారం.. కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన వల్లూరి సాయినిరంజన్ (28) హైదరబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం చేస్తున్నాడు. గతేడాది ఆగస్టు 23న వివాహమైంది. శనివారం ఉదయం పశ్చిమగోదావరి జిల్లా తణుకు అత్తవారింటికి వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై పయనమయ్యాడు. పెదపళ్ల కొత్తూరు సెంటర్ నుంచి అచ్యుతాపురం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పెదపళ్ల కోళ్లఫారం సమీపంలో అతడిని లారీ వేగంగా వచ్చి ఢీకొంది. తలకు తీవ్ర గాయామై అపస్మారక స్థితికి వెళ్లిపోవడంతో సాయినిరంజన్‌ను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. శవపరీక్ష నిమిత్తం మృతదేహన్ని మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివాహమై ఏడాది కాకుండానే సాయినిరంజన్ మరణించడంతో బంధువులు బోరున విలపిస్తున్నారు.

యువకుడి అదృశ్యం...

అక్విడెక్టుపై బైక్, చెప్పులు, దుస్తులు, యాసిడ్‌బాటిల్



అదృశ్యమైన గోవిందరాజులు

ముమ్మిడివరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కర్రివానిరేవు గ్రామానికి చెందిన అద్దంగి గోవిందరాజులు (30) అదృశ్యంపై కేసు నమోదైంది. శ్రావణ శుక్రవారం సందర్భంగా గోవిందరాజులు భార్య భవానీని పూజా సామగ్రి కొనేందుకు గురువారం సాయంత్రం మురమళ్ల తీసుకెళ్లి తిరిగి ఇంటి దగ్గర దింపి యానాంలో తాను పనిచేసే చోట ఒక వ్యక్తి సొమ్ములు ఇవ్వాలని తీసుకుని వస్తానని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో భార్య భవానీ భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో గోవిందరాజుల స్నేహితులకు ఫోన్ చేసినా ఆచూకీ తెలియలేదు. దీంతో ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్‌కు భవానీ ఫిర్యాదు చేసింది. గోవిందరాజులు కోసం గాలింపు చర్యలు చేపడుతుండగా అన్నంపల్లిలోని కొత్త అక్విడెక్టుపై గోవిందరాజులు మోటారు సైకిల్, చెప్పులు, దుస్తులతో పాటు సగం ఉన్న యాసిడ్ బాటిల్ కనిపించింది. దీంతో ఆరు పడవలపై గోవిందరాజుల కోసం అన్నంపల్లి అక్విడెక్టు నుంచి బలుసుతిప్ప వరకు గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం సాయంత్రం వరకు అతడి ఆచూకీ లభ్యం కాలేదు. గోవిందరాజులు గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎక్కడికైనా వెళ్లిపోయాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దిశగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేశారు.



అన్నంపల్లి నూతన అక్విడెక్టుపై ఉంచిన మోటారు సైకిల్, దుస్తులు, యాసిడ్ బాటిల్



గోదావరిలో గాలిస్తున్న దృశ్యం

దుబాయ్‌లో చిక్కుకున్న అంబాజీపేట యువకుడు

ఏజెంటు మోసం

కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారుల జోక్యం



కనకరాజు

అమలాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాలకు పంపిస్తామని ఏజెంట్లు చేస్తున్న మోసాల్లో మరో యువకుడు చిక్కుకున్నాడు. అతడిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట గ్రామానికి చెందిన పొన్నాడ మంగ కుమారుడైన పొన్నాడ కనకరాజు ఒక నకిలీ ఏజెంటు చేసిన మోసంలో చిక్కుకున్నాడు. నెలకు రూ.50వేలకు పైగా జీతం వస్తుందని నమ్మబలికి కేవలం 8 గంటల పని మాత్రమే గల్ఫ్‌లో చేయాల్సి ఉంటుందని కనకరాజును దుబాయ్‌కు పంపించారు. అయితే ఏజెంట్ చెప్పిన మాటలకు, అక్కడ ఉన్న పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. సరైన పని దొరకక పోవడం, అక్కడ యజమానులు పెట్టే ఇబ్బందులను భరించలేని పరిస్థితుల్లో తల్లి మంగకు తన కష్టాన్ని కుమారుడైన కనకరాజు చెప్పుకున్నాడు. దాంతో పొన్నాడ మంగ అమలాపురం కలెక్టరేట్‌లో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను ఆశ్రయించింది. ఎన్నో అప్పులుచేసి తన కుమారుడు ఏజెంటు మాటలు నమ్మి దుబాయ్‌లో మోసపోయాడని, అతడిని స్వస్థలానికి రప్పించాలని కలెక్టర్ మహేష్‌కుమార్‌ను అభ్యర్థించింది. దీనిపై స్పందించిన కలెక్టర్ మైగ్రేషన్ సెంటర్ నోడల్ అధికారి కె.మాధవి ఇచ్చిన ఆదేశాలతో కనకరాజును ఇండియాకు రప్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దుబాయ్‌లో కనకరాజు పడుతున్న ఇబ్బందులు గుర్తించిన అధికారులు ఇండియాకు రప్పించేందుకు విదేశీ రాయబార మంత్రిత్వశాఖ అధికారులతో సంప్రదింపులు చేసి కనకరాజును తీసుకొచ్చే చర్యలు చేపట్టామని నోడల్ అధికారి కె.మాధవి, సమన్వయ అధికారి గోళ్ల రమేష్ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో కలత చెంది...

ఉరేసుకున్న యువకుడు



మరణించిన అప్పారావు

మోతుగూడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం జెన్‌కో కాలనీకి చెందిన యువకుడు శుక్రవారం రాత్రి 10 గంటలకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సాధిక్ తెలిపిన వివరాలు ప్రకారం. మోతుగూడెం ఏపీ జెన్‌కో భవ్య హెల్త్‌కేర్ సెంటర్లో పనిచేస్తున్న గోసాని అప్పారావు (34) గతంలో 24 గంటల అపెంటిసైటీస్ సర్జరీ చేయించుకున్నాడు. అప్పటి నుంచి తీవ్రమైన అనారోగ్య సమస్యల వల్ల మానసికంగా కలత చెందుతున్నాడు. ఈ నేపథ్యంలో తాను నివసిస్తున్న ఇంటో ఇనుసరాడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని చింతూరు ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ సాధిక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

రత్నగిరిపై వ్రత మండపాల్లో వర్షం నీరు

భక్తుల అసహనం

వ్రతాలు నిలుపుదలచేసిన ఈవో

అన్నవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో రూ.వెయ్యి వ్రత మండపాల్లో శ్లాబ్ పెచ్చులూడి వర్షం నీరు పడడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. విషయం ఈవో సుబ్బారావు దృష్టికి చేరడంతో నీరు కారే వ్రత మండపాల్లో వ్రతాలు నిలిపి మిగిలిన మండపాల్లో చేపట్టాలని ఆదేశించారు.



పొంగి పొర్లిన 'అలుగువాగు'

ఎటపాక, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువప్రాంతం నుంచి వరదనీరు వచ్చి చేరడంతో అలుగువాగు ప్రాజెక్టు పొంగి పొర్లింది. అల్లూరి జిల్లా ఎటపాక మండలం అచ్చుతాపురం గ్రామం వద్ద ఉన్న అలుగువాగు ప్రాజెక్టు శనివారం వరదనీటి ప్రవాహంతో ఉధృతంగా ప్రవహించింది. దీంతో వరదనీరు కుడి, ఎడమ కాల్వల నుంచి వాగుల్లోకి ప్రవహించింది. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో ఇప్పటివరకు ప్రాజెక్టు నిండలేదు. ఇటీవల వర్షాలకు ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. ఇదిలా ఉంటే ప్రాజెక్టు దిగువన గిరిజనులు చేపల వేటను సాగించారు.



గోదావరి గట్టు.. మేఘాల జట్టు...

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద మేఘాలు కమ్ముకుని కనువిందు చేశాయి. ఈ అందమైన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించండి

గోకవరం ప్రభుత్వాసుపత్రి తనిఖీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత

గోకవరం, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రబలుతున్న జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించి తద్వారా నిరోధక చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో పి.సరిత సూచించారు. గోకవరం ప్రభుత్వాసుపత్రిని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషంట్ల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో డ్రై డే- డ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం మందులు, రోజువారీ ఓపీ వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు.

'వీధి దీపాలు ఏర్పాటు చేయాలి'

దివాన్‌చెరువు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వీధి దీపాలు లేక చీకటి పడితే చాలు తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని దివాన్‌చెరువు- వెలుగుబంద రోడ్‌లోని రామ్‌రైజ్ స్మార్ట్‌సిటీ రెసిడెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి జి.ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేసారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దివాన్‌చెరువు-పాలచర్ల దారిలో వై.జంక్షన్ (శ్మశాన వాటిక) వద్ద రాత్రి 10 గంటలవరకూ అసాంఘిక శక్తుల సంచారం ఉంటోందని, దీంతో బయటకు వెళ్లిన వారు.. ముఖ్యంగా మహిళలు చాలా భయపడుతున్నారన్నారు. ఆ సమయంలో వీధికుక్కల సంచారం కూడా ఆందోళన కలిగిస్తోందన్నారు. వై.జంక్షన్ నుంచి రామ్‌రైజ్ సిటీ వరకూ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రసాదరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

బిక్కవోలు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కొంకుదురు ఉన్నత పాఠశాలలో 2022లో పదో తరగతి పూర్తి చేసిన కురందాసు పురందేశ్వరికి ఏటా రూ.25 వేలను ఆమె చదువు నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన మాదిరెడ్డి జగన్నాథరావు మెమోరియల్ ట్రస్ట్ అందిస్తోంది. ఇందులో భాగంగా శనివారం సర్పంచ్ సత్తి వీరమణి రూ.25 వేల చెక్కును ట్రస్ట్ తరఫున అందించారు. ప్రస్తుతం గణేశ్వరి బీ.టెక్ మూడో యేడాది చదువుతోంది. బీ.టెక్ పూర్తయ్యే వరకూ ఈ సాయం అందజేస్తుందని హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, సత్తి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు గౌతు లచ్చన్న

జయంతి కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ చెంచిరెడ్డి



లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏఎస్పీ చెంచిరెడ్డి

రాజమహేంద్రవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి పేర్కొన్నారు. గౌతు లచ్చన్న జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం చెంచిరెడ్డి మాట్లాడుతూ మహనీయులను స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పేదల పక్షాన పోరాడిన గొప్ప వ్యక్తి లచ్చన్న అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ రవి కుమార్, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఐ సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త డాక్టర్ గౌతు లచ్చన్న జిల్లా స్థాయి జయంతి వేడుకలు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1909 ఆగస్టు 16న శ్రీకాకుళం జిల్లా బారువ గ్రామంలో జన్మించిన ఈయన చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రవేశించారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లో పాల్గొన్నారని, బెరంపూర్,రాజమండ్రి సెంట్రల్ జైళ్లలో కఠినమైన శిక్షలు అనుభవించారన్నారు. 1940లో పలాసలో నిర్వహించిన అఖిల భారత కిసాన్ సభ, 1948లో ఆంధ్రాలో వెనుకబడిన తరగతుల సదస్సులో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి శశాంక, డీఆర్‌వో సీతారామమూర్తి, ముత్యాల సుబ్బరాజు, టీవీ ప్రసాద్, వసతి గృహాల అధికారులు, కలెక్టరేట్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక వై.జంక్షన్‌లోని గౌతు లచ్చన్న విగ్రహానికి రాష్ట్ర బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు.సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి కృషి చేసిన లచ్చన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు డి.జార్జి ఆంటోని, బత్తిన ఏడుకొండలు, పోలవరపు రాము, బీఎస్‌వీ ప్రతాప్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక వై-జంక్షన్ వద్ద జరిగిన కార్యక్రమంలో గౌతు లచ్చన్న విగ్రహానికి ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ బిరుదు పొందిన తెలుగు నాయకుడు లచ్చన్న అని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలను పట్టించుకోలేదు సరికదా, ప్రజా నాయకుడైన గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలన్న కనీస ఆలోచన కూడా వారికి రాలేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని జీవో జారీ చేసిందని, కూటమి ప్రభుత్వానికి లచ్చన్న పట్ల, బీసీ కులాల పట్ల ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. మద్యం దుకాణాలు, బార్ల ఏర్పాటుల్లో 10శాతం రిజర్వేషన్లు గీతకులాలకు కల్పించిందని, ఇది బీసీలకు తమ ప్రభుత్వమిచ్చిన గౌరవమన్నారు. దామాషా ప్రకారం బీసీలకు నగరంలో టీడీపీ, వివిధ కార్పొరేషన్లు, ఎండోమెంట్‌లో నామినేటెడ్ పదవులు ఇచ్చినట్టు ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఎమ్మెల్యే బత్తుల, ఆదిరెడ్డి అప్పారావు.. గౌతు లచ్చన్న సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు వాసు,బత్తుల

మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి

అనపర్తి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రదానిగా అటల్ బిహారీ వాజ్‌పేయి చేసిన సేవలు చిరస్మరణీయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం వాజ్‌పేయ్ వర్ధంతి సందర్భంగా రామవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

గోపాల..గోపాల..

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో అలరించిన చిన్నారులు



అనపర్తి: శ్రీకృష్ణుడికి హారతిస్తున్న దృశ్యం



సీతానగం: శ్రీకృష్ణుడిని అలంకరిస్తున్న దృశ్యం

రాజానగరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని శ్రీకృష్ణ ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.ఉదయం శ్రీకృష్ణకి ప్రత్యేక పూజలు జరిపించారు. పాలు, వెన్న, పాత బెల్లం, సొంటి, వాము మిశ్రమంతో తయారు చేసిన కాయం చూర్ణాన్ని నైవేద్యంగా సమర్పించిన అనంతరం భక్తులకు ప్రసాద వితరణగా అందించారు. ప్రత్యేక పూజలు జరిపించారు. రాజానగరం శివాలయంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాల వద్ద సాయంత్రం ఏర్పాటు చేసిన ఉట్టు కొట్టు వేడుకల్లో యాదవ యువకులు పోటా పోటీగా పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కృష్ణాష్టమి వేడుకలను తిలకించారు.

గోకవరం: గోకవరంలోని గీతామందిరం వద్ద శ్రీకృష్ణునికి శ్రీకృష్ణ అష్టోత్తర సహిత పాలాభిషేకం, ఉయ్యాల సేవ, విష్ణు సహస్రనామ పారాయణం, ఉట్టుకొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. ఫారెస్ట్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆలయంలో శ్రీకృష్ణుడిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్ర సమయంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

బిక్కవోలు: బిక్కవోలులోని అంబటి పేటలో శ్రీకృష్ణుడిని రథంలో ఉంచి గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తీన్‌మార్ డప్పులు, డాన్స్‌లు అందర్నీ అలరించాయి. అలాగే కొత్తపేటలోని శ్రీకృష్ణాలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భజన బృందాలు, కోలాట నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

అనపర్తి: అనపర్తిలోని బాల రాజేశ్వరి పీఠంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సనాతన ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. వేద పండితుడు రెడ్డి సురేష్ శర్మ..స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి కృష్ణాష్టమి విశిష్టతను భక్తులకు వివరించారు. బృందావనాన్ని తలపించే విధంగా చేసిన ఏర్పాట్లు భక్తులను ఆకట్టుకున్నాయి.అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో రామ్మోహనరావు, సతీష్, నల్లమిల్లి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సాయిరామ్ మందిర్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉట్టి ఉత్సవం ఆకట్టుకుంది. చిన్నారులు కృష్ణుడి వేషధారణలతో అలరించారు.

కోరుకొండ: మండలంలోని పశ్చిమగోనగూడెం గ్రామంలో గీతా మిషన్ వద్ద రుక్మిణ సమేత శ్రీకృష్ణ భగవాన్‌కు పంచామృతాలతో వేద పారాయణం, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రఘురాం ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామికి పంచామృత అభిషేకం, విశేష అర్చనలు, ఆరాధనలు జరిగాయి. విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక సేవాకాలం, ఉట్టి ఉత్సవం నిర్వహించారు. అనంతరం సేవాకాలం, తీర్థగోష్టి జరిగింది. కార్యక్రమంలో గీతామిషన్ శ్రీకృష్ణ ఆలయ కమిటీ సభ్యులు బొమ్మల గంగరాజు దంపతులు, వీరబాబు దంపతులు, కట్టా రాజబాబు దంపతులు, మహిళా మండలి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఉట్టు ఉత్సవంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నర్సాపురంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గాదరాడ ఓం శివశక్తి పీఠం, కోరుకొండ, రామవాపురం, గుమ్ములూరు గ్రామాల్లో శ్రీకృష్ణ మందిరాలు భక్తులతో పోటెత్తాయి

సీతానగరం: సీతానగరంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయార్చకుడు నాగార్జున స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ముగించారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమహేంద్రవరంలోని ఆర్యాపురంలో శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో శ్రీ త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహరాజ్ పర్యవేక్షణలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. రూ.3 లక్షల కరెన్సీ నోట్లతో శ్రీకృష్ణ మందిరాన్ని అలంకరించారు. పలువురు భక్తులు కృష్ణుని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. గోకుల్ టీవీఎస్ అధినేత ఎస్‌వీవీ సత్యనారాయణ ఉట్టిని ప్రారంభించారు. అనంతరం ఉట్టి కొట్టడం ప్రారంభించారు. ఉట్టి పోటీలకు జడ్జీలుగా, పీవీఎస్ కృష్ణారావు, ముట్నూరి పార్వతి పాల్గొన్నారు. ఫాన్సీ డ్రెస్ పోటీలు, గురుపూజ, ప్రవచనం తదితర కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం శ్రీ నందోత్సవం జరుగుతుందని ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు.



బిక్కవోలులో శ్రీకృష్ణునికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మానసిక ప్రశాంతత: చినరాజప్ప

రంగంపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం ఆయన రంగంపేట మండలం మర్రిపూడిలోని శ్రీరాధాకృష్ణ ఆలయాన్ని సందర్శించారు. తన గెలుపు కోసం సామర్లకోట మండలం వేట్లపాలెం టీడీపీ నాయకుడు గుమ్మల్ల రామకృష్ణ మొక్కిన మొక్కును తీర్చడానికి మర్రిపూడి వచ్చినట్టు రాజప్ప చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన భగవద్గీత పారాయణాన్ని ఆయన ప్రశంసించి బహుమతులు అందజేశారు.ఎమ్మెల్యే చినరాజప్పతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, నూనె రామారావు, గుమ్మల రామకృష్ణలను ఆలయ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోట నారాయణరావు, పుట్టా సోమన్న చౌదరి, పీటీ చౌదరి, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, మోదుకూరి బంగార్రాజు, పుట్టా రామకృష్ణ, పాతూరి భాస్కర్రావు పాల్గొన్నారు.



గోకవరంలో కృష్ణాష్టమి వేడుకల్లో భక్తులు



రంగంపేటలో చిన్నారులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప



ఆర్యాపురంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

హోరాహోరీగా హ్యాండ్‌బాల్ పోటీలు

దివాన్‌చెరువు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సీబీఎస్ఈ సౌత్ జోన్ (1)హ్యాండ్ బాల్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-14 విభాగంలో వెల్లమ్మల విద్యాలయం(తమిళనాడు)తో జరిగిన పోటీలో చేరక్ ఇంటర్నేషనల్ (హైదరాబాదు) జట్టు విజయం సాధించింది. అలాగే గుంటూరు విజ్ఞాన్ విద్యాలయం, ఆర్‌జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ నేషనల్ రిఫరీ ఎస్.గోపీకృష్ణతో జరిగిన పోటీలో నంద్యాల జట్టు గెలుపొందింది. తెనాలి వెస్ట్ బెర్రీ స్కూల్‌తో జరిగిన పోటీలో పబ్లిక్ స్కూల్ హైదరాబాద్ విజేతగా నిలిచింది. రెడ్డీ స్కూల్‌పై ఏకశిల హైస్కూల్ జట్టు విజయం సాధించింది. అండర్-17 విభాగంలో తెనాలి సెయింట్ జోసెఫ్ జట్టుపై మధురై రైల్వే హయర్ సెంకడరీ స్కూల్ జట్టు విజయం సాధించగా, ది నంద్యాల పబ్లిక్ స్కూల్ జట్టుపై వెలమలై విద్యాలయం జట్టు గెలుపొందింది. అండర్-19 విభాగంలో శ్రీకృష్ణ స్వామి ఇంటర్నేషనల్ స్కూల్‌పై వెలమలై విద్యాలయం జట్టు గెలుపొందింది. స్ప్రింగ్ డే స్కూల్‌పై వెలమలై విద్యాలయం జట్టు విజయం సాధించినట్టు నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కూటమి పాలన

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

రంగంపేట,ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) :ఇటు అభివృద్ధి అటు సంక్షేమం లక్ష్యంగా కూటమి పాలన సాగుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం ఆయన మండలంలోని మర్రిపూడి విచ్చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సూపర్ సిక్స్ సూపర్‌గా అమలు జరుగుతుందని, పులివెందుల జడ్పీటీసీ ఓటమి తర్వాత జగన్ ఇక దుకాణం సర్దుకోవడం మంచిదని వ్యాఖ్యానించారు. మర్రిపూడి గ్రామస్థులకు పెద్దాపురం రహదారి అవస్థలు తప్పుతాయన్నారు. కార్యక్రమంలో కోట నారాయణరావు, పుట్టా సోమన్న చౌదరి, పీటీ చౌదరి, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, మోదుకూరి బంగార్రాజు, పుట్టా రామకృష్ణ, పాతూరి భాస్కరారవు, పుట్టా వీరభద్రరావు, పాలకుర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బలభద్రపురంలో అక్రమంగా చేపట పట్టివేత

పోలీసులకు ఫిర్యాదు.. రెండు వ్యాన్లు సీజ్

బిక్కవోలు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా చేపలు పడుతున్న వ్యక్తులపై తహశీల్దార్ సత్యకృష్ణ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా 5.79 ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు తప్పుడు పట్టాలతో ఆక్రమించుకుని చెరువులు తవ్వుకోవడంతో వాటిని 2016లో రద్దు చేశారు. దీంతో వారు 2024లో ఆ భూములను కొనుగోలు చేశామంటూ హైకోర్టును ఆశ్రయించడంతో 2025లో స్టేటస్‌కో విధించింది. అయితే శనివారం తెల్లవారుజామున సింగిడి దుర్గాప్రసాద్ తన అనుచరులతో వచ్చి చెరువులోని చేపలను పట్టి రెండు వ్యాన్లలో తరలిస్తుండగా తహశీల్దార్ సిబ్బందితో వచ్చి చేపలను చెరువులోకి వదిలి వేసి రెండు వ్యాన్‌లను, ఒక ఆటో, వలలు, 7 సింథటిక్ ట్యాంకులు, 3 గ్యాస్ సిలెండర్లను సీజ్ చేసి బిక్కవోలు పోలీస్ స్టేషన్‌కు తరలించి ఫిర్యాదు చేశామన్నారు.

గాదాలమ్మ నగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 10వ డివిజన్ గాదాలమ్మ నగర్‌లో ఆయన కూటమి నాయకులు వైశ్రీను, వాసిరెడ్డి బాబి, నగరపాలక సంస్థ అధికారులలతో కలిసి పర్యటించారు. గాదాలమ్మ నగర్ రోడ్డు నుంచి బీవీఆర్ కన్వెన్షన్ హాల్ సమీపం వరకూ రోడ్డు, దానికి ఇరువైపులా డ్రైనేజీల నిర్మాణంపై అధికారులు,స్థానిక పెద్దలతో చర్చించారు. స్థానికంగా మురుగునీరు రోడ్లపై పారడాన్ని ఆయన గుర్తించి దానికి శాశ్వత పరిష్కారం చూపించేలా రోడ్లు, డ్రైనేజీలను నిర్మించాలన్నారు. నాయకులు, చొప్పెర్ల వీరభద్రరావు, రేగేటి సూరిబాబు, అప్పారావు, కంటిపూడి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతం

నల్లజర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దానధర్మ చారిటబుల్ ట్రస్ట్, వేద సంకల్ప సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పుల్లలపాడు హరిజనపేట రామాలయంలో శనివారం సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. పురోహితులు ప్రత్యేక పూజలు జరిపారు. పూజలో పాల్గొన్న 30 మంది మహిళా భక్తులకు చీర, జాకెట్, పూజా సామాగ్రి అందించారు. కార్యక్రమంలో ఉండ్రాజవరపు వెంకటరత్నం, పాతూరి వర ప్రసాద్, పాతకోకల వెంకట్ పాల్గొన్నారు.

వయ్యారిభామ వ్యాప్తి నివారణకు సమష్టి కృషి

అవగాహన వారోత్సవాల్లో కేవీకే హెడ్ నాయుడు

రాజానగరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సమష్టి భాగస్వామ్యంతో వయ్యారిభామ కలుపు మొక్క వ్యాప్తిని సమూలంగా అరికట్టవచ్చని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) హెడ్ బీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. ఐకార్-ఎన్ఆర్‌సీఏ(సీటీఆర్ఐ) ఆధ్వర్యంలో కేవీకేలో వయ్యారిభామ(పార్థీనియం)కలుపు మొక్కపై అవగాహన వారోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ నెల 22 వరకు ఈ వారోత్స వాలు జరుగుతాయన్నారు. వయ్యారి భామ ప్రమాదకరమైన కలుపు మొక్క అని, దీనిలోని కొన్ని రసాయనాల వల్ల సహచర మొక్కల పెరుగుదల క్షీణించిపోతుందన్నారు. మనుషులకు కూడా ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటీస్ వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. దీని ఆకులు, చర్మాన్ని తాకితే మన చర్మంపై ఎర్రని దద్దుర్లు ఏర్పడతాయని, పుప్పొడి కలిగిన గాలిని పీలిస్తే జలుబు, కళ్లు ఎర్రబడడం, కను రెప్పల వాపులు వస్తాయన్నారు. పశువులు పొరపాటున గడ్డితో పాటు తింటే మూత్రపిండాలు, కాలేయం, అన్నవాహిక, శ్వాసక్రియలు దెబ్బతింటాయన్నారు. పాల నాణ్యత తగ్గి దుర్వాసనతో రుచి లేకుండా కొంచెం చేదుగా ఉంటాయని పేర్కొన్నారు.

నివారణ..

వయ్యారిభామ పూతదశకు రాకముందే వేళ్లతో సహా పీకి తగలబెట్టాలి. 10 లీటర్ల నీటికి 5 కిలోల ఉప్పును కలిపి పిచికారీ చేస్తే ఈ మొక్కలు మొలకెత్తవు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది ఎన్వీ రఘునందన్, బి.నాగేశ్వరరెడ్డి, సంజయ్ హెగ్డే, విజయవర్ధన్, విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలకు చెందిన వ్యవసాయ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

'రాజరాజ నరేంద్రుడి జయంతి, వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి'

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరాన్ని స్థాపించిన రాజరాజ నరేంద్రుని జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. తూర్పు చాళుక్య రాజైన రాజరాజ నరేంద్రుడు, రాజమహేంద్రవరం నగరాన్ని స్థాపించారని, ఆయన పాలనలో సామాజికంగా, సాంస్కృతికంగా గణనీయమైన పురోగతి సాధించిందని, ఆయన అభ్యర్థనతో ఆయన ఆస్థాన కవి నన్నయ భట్టారకుడు మహాభారతాన్ని తెలుగులోకి అనువదించడం ద్వారా రాజమహేంద్రవరానికి ఎనలేని కీర్తిప్రతిష్టలు ఏర్పడి, చారిత్రాత్మక నగరంగా వర్ధిల్లుతోం దన్నారు. నేటికి రాజరాజ నరేంద్రుని పట్టాభిషేకం జరిగి 1003 సంవత్సరాలైన సందర్భంగా శనివారం స్థానిక పుష్కరాల రేవు వద్ద రాజరాజ నరేంద్రుని విగ్రహానికి పూలమాలులు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జెట్టి రామారావు, దేశిరెడ్డి బలరామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఉద్యోగుల సంఘం గుర్తింపు దినోత్సవం



రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపు దినోత్సవాన్ని శనివారం రాష్ట్ర సంఘం ఘనంగా నిర్వహించింది. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి భవనం ఆవరణలో జరిగిన వేడుకల్లో సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ సంఘం జెండాను ఆవిష్కరించారు. 2019 ఆగస్టు 16న ఈ సంఘం శాశ్వత గుర్తింపు పొందిందని, ఇది తమకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు జీబీ విజయకుమార్, కె.వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, ఎ.శ్రీనివాసరావు, రమేష్, జమీర్, ఆదివిష్ణు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి, సంక్షేమం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


రైతుల ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీ

అనపర్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోను, రాష్ట్రంలోను కూటమి ప్రభుత్వం.. డబుల్ ఇంజన్ సర్కార్ డబుల్ స్పీడుతో అభివృద్ధి, సంక్షేమాల్లో దూసుకుపోతోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలైన సందర్భంగా నియోజకవర్గంలోని రైతుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భారీ ట్రాక్టర్ ర్యాలీలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. బిక్కవోలు మండలం కొమరిపాలెం నుంచి తొస్సిపూడి, బలభద్రపురం, లక్ష్మీనరసాపురం మీదుగా 300 పైబడి ట్రాక్టర్లతో ర్యాలీగా అనపర్తి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని, రైతులకు పీఎం కిసాన్ రూ.2 వేలు, అన్నదాత సుఖీభవ రూ.5 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఐదేళ్లుగా కాలువల్లో గుర్రపుడెక్క పూడుకు పోయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపామన్నారు. అలాగే రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి 24గంటల్లో సొమ్ము చెల్లించడమే కాకుండా రైతులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూడా చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. అలాగే ఉచిత సిలెండర్లు, తల్లికి వందనం పథకాలను అమలు చేశామన్నారు. ఏడాది కాలంలో కూటమి కేంద్ర ప్రభుత్వం అందించిన రూ.3లక్షల కోట్ల సహాయంతో అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో అళ్ల గోవిందు, జుత్తుగ కృష్ణ, తమలంపూడి సుధాకరరెడ్డి, వెలుగుబంటి సత్తిబాబు, నల్లమిల్లి సుబ్బారెడ్డి, రావాడ నాగు, కర్రి బులిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: ఎన్నికల హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసిన శుభ సందర్భంగా సుమారు 500 ట్రాక్టర్లతో కోరుకొండ నుంచి గాడాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ట్రాక్టర్ నడిపి వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రైతులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని, సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా చంద్రన్న పాలన కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం నిధులను మంజూరు చేసి రైతుల కళ్లల్లో ఆనందాన్ని నింపారన్నారు. రైతుల కష్టం తెలిసిన నాయకుడు సీఎం చంద్రబాబు అని కొనియాడా రు. అన్నదాత సుఖీభవ పథకం కింద తొలివిడ తగా రూ.7 వేలు జమ చేసిన సీఎం చంద్రబా బుకు, కూటమి ప్రభుత్వానికి రైతులు కృతజ్ఞత లు తెలిపారని ఎమ్మెల్యే అన్నారు. వైసీపీ పాలనలో రైతులు అడుగడుగునా దగా పడ్డారని, అన్నదాతకు ఇచ్చిన మాట మేరకు సీఎం చంద్ర బాబు ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారన్నారు. నిన్నటి నుంచి మహిళలకు ఉచిత స్త్రీ బస్సు పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు.అనంతరం ట్రాక్టర్ ర్యాలీ విజయవంతం చేసిన రైతులకు నియోజకవర్గ కూటమి నాయకులకు,కార్యకర్తలకు ఎమ్మెల్యే బత్తుల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీగా పాల్గొన్నారు.

పెండింగ్ బిల్స్ మంజూరు..

బిక్కవోలు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో 2014-19లో చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్స్‌కు ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఎంపీపీ తేతలి సుమ అధ్యక్షతన రంగంపేట, బిక్కవోలు, అనపర్తి మండలాల్లోని కాంట్రాక్టర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో వున్నప్పటికీ ఎన్నికల హామీ మేరకు నియోజకవర్గంలోని 368 పెండింగ్ బిల్స్‌కు సంబంధించి ఈ మొత్తాన్ని మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.







ఉట్టిపడిన ఆనందం

ఆనందుడే!

ఆనందం ఉట్టిపడింది.. ఆబాలగోపాలం వేడుకల్లో మునిగితేలారు.. ఆనందంగా పండుగ చేసుకున్నారు.. కృష్ణాష్టమి సందర్భంగా శనివారం ఉదయం నుంచి కృష్ణాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.. రాజమహేంద్రవరం, కొవ్వూరు, తాళ్లపూడి తదితర మండలాలకు భక్తజనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కృష్ణుడి సేవలో తరించారు.. రారా కృష్ణయ్యా, రారా కృష్ణయ్యా అంటూ పిలుస్తూ మురిశారు.. తమ ఇంట చిన్నారులకు కృష్ణాగోపికల అలంకారం చేసి తల్లిదండ్రులు కన్నులారా చూసుకుని మురిసిపోయారు.





రాజమహేంద్రవరం ఇస్కాన్‌లో ప్రత్యేకఅలంకరణలో రాధాకృష్ణులు.. స్వామికి పుష్పాభిషేకం..



కొవ్వూరు గౌడీయమఠంలో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు



హ్యాప్రీగా!
ప్రయాణం పండగే

(కాకినాడ/రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రప్రభుత్వం శుక్రవారం నుంచి ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణం పథకానికి అనూహ్య స్పందన లభిస్తోంది. మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తూ ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. కేవలం ఆధార్ చూపించి జీరో ఫేర్ టికెట్‌తో ప్రయాణించడం సరికొత్తగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చడంతో మహిళలు నీరాజనం పడుతున్నారు. ఆగస్టు 15న ప్రారంభమైన ఈ పథకం కింద తొలిరోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,283 మంది మహిళలు ఉచితంగా ఐదు రకాల ఫ్రీబస్సుల్లో ప్రయాణించారు. అది కూడా శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి 12 గంటల్లోపు. అంటే కేవలం తొలిరోజు కేవలం ఏడు గంటల వ్యవధిలో 8,283 మంది రికార్డుస్థాయిలో ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకోవడం విశేషం. రెండో రోజైన శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 36 వేల మంది వరకు ఫ్రీగా ప్రయాణించారు. ప్రస్తుతం వరుస సెలవులు కావడంతో ఉచిత బస్సు ప్రయాణానికి రద్దీ అంతంతమాత్రంగానే ఉంది. సోమవారం నుంచి లక్షల్లో ప్రయాణిస్తారని అధికారులు అంచనా వేశారు.

సూపర్‌హిట్ పథకం..

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా టీడీపీ ఇచ్చిన ఉచిత బస్సు పథకం శుక్రవారం నుంచి అమల్లోకి రావడంతో మహిళాలోకం సంబరాలు చేసుకుంటోంది. మహిళలు తమ ఆధార్‌కార్డులు చూపించగా గమ్యస్థానం ఆధారంగా టికెట్ ఛార్జీని ప్రస్తావిస్తూ కండక్టర్లు జీరోఫేర్ టికెట్ అందించారు. తూర్పుగోదావరి జిల్లాలో నాలుగు డిపోల పరిధిలో 2,345 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు.అత్యధికంగా రాజమహేంద్రవరం డిపోలో ఉన్నారు. రెండో రోజైన శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించినట్టు అధికారులు అంచనా వేశారు. ప్రతిరోజు అర్ధరాత్రి 12 దాటిన తర్వాత ఆ రోజు మొత్తం జీరోఫేర్ టికెట్లు ఎన్ని జారీ చేశారో లెక్కించి తద్వారా ఆ రోజు ఫ్రీ బస్సు ప్రయాణాలెన్ని అనేది అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారు. ప్రస్తుతం సెలవులు ఉన్న నేపథ్యంలో ఫ్రీ బస్సు ప్రయాణాలకు రద్దీ భారీ స్థాయిలో ఉండడం లేదని..దీంతో ఆర్టీసీ సిబ్బందికి కొంత ఉపశమనం కలిగినట్టు అధికారులు చెబుతున్నారు.సోమవారం నుంచి ఉచితబస్సు ప్రయాణం చేసే మహిళలు భారీ స్థాయిలో పెరుగుతారని అంచనా వేస్తున్నారు.ఉమ్మడి జిల్లాలో సోమవారం నుంచి సరాసరి రోజుకు 1.90 లక్షల మందికిపైనే మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

- స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్
- ఉమ్మడి జిల్లాలో భారీ స్పందన
- ఫస్ట్ డే 8,283 మంది ప్రయాణం
- శనివారం 36 వేలని అంచనా
- సెలవులు కావడంతో తక్కువ రద్దీ
- సోమవారం నుంచి కిటకిట
- 1.90 లక్షలకు పెరగొచ్చని అంచనా
- ఆర్టీసీ అధికారుల ప్రత్యేక ఏర్పాట్లు
- వాడపల్లి స్పెషల్ బస్‌లకు టిక్కెట్

తూర్పున 283 బస్‌లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మహిళలు హ్యాప్రీగా ప్రయాణిస్తున్నారు.. టిక్కెట్ ఊసులేకపోవడంతో ఆనందంగా బస్‌లు ఎక్కుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 99 బస్సు రూట్లు ఉన్నాయి. అందులో 72 రూట్లలో ఉచిత ప్రయాణం అనుమతించారు. సూపర్‌లగ్జరీ, ఇంద్ర తదితర బస్సులు తిరిగే 23 రూట్లలో మాత్రం ఉచిత ప్రయాణం అనుమతించ లేదు. జిల్లాలో మొత్తం 283 బస్సులు ఉండగా 223 బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. రెండో రోజు సుమారు 95 శాతం మహిళలు ప్రయాణం చేశారు. సాధారణ ప్రయాణికులతో పాటు ప్రైవేట్, ప్రభుత్వ శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగినులు సంబరపడుతున్నారు. రూట్ల సంఖ్యను పెంచడంతో పాటు సమయపాలన పాటించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.బస్ సౌకర్యం లేని గ్రామాలకు బస్సులు పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. రాజమండ్రి షెల్టాన్ సెంటర్ వద్ద బస్సు పాయింట్ సరి చేయాలని పలువురు మహిళలు తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి అమలాపురం రూట్‌లో ఎక్స్‌ప్రెస్‌లు అధికం.రాజమహేంద్రవరం, రావులపాలెం, కొత్తపేట తర్వాత అమలాపురంలో మాత్రమే ఆగుతాయి. ఇక్కడ టికెట్ రూ.75.పల్లె వెలుగు బస్సులకంటే వేగంగా వెళతాయి.అందువల్ల ఈ రూట్ మహిళా ప్రయాణికులు ఉచితంగా వేగంగా ప్రయాణించే అవకాశం ఉంటుంది. ఎక్కువ మంది ఉద్యోగులు రాజమహేంద్రవరం నుంచి కాకినాడకు నాన్ స్టాప్‌లో వెళతారు.కానీ నాన్ స్టాప్‌కు ఉచితం వర్తించదు. తుని, అన్నవరం రూట్లలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు బాగా ఉపయోగపడుతున్నాయి. సోమవారం నుంచి ప్రయాణికులు పెరుగుతారు.



వాడపల్లి స్పెషల్‌కు.. 'నో ఫ్రీ'..

వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రత్యేక బస్సుల్లో నో ఫ్రీ. జిల్లా వ్యాప్తంగా వాడపల్లికి 22 బస్సు సర్వీసులు వివిధ డిపోల నుంచి నడుపుతున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 90 బస్సులు వస్తుంటాయి. ఈ బస్సు సర్వీసులన్నింటినీ ప్రత్యేక సర్వీసులుగా పరిగణిస్తూ ఆదేశాలు రావడంతో శనివారం తెల్లవారుజామునే డిపోలకు చేరుకున్న మహిళా భక్తులకు ఆర్టీసీ షాక్ ఇచ్చింది. స్పెషల్ సర్వీసులకు టిక్కెట్లు తీసుకోవాలని చెప్పడంతో ప్రయాణికులంతా అవాక్కయ్యారు. వాడపల్లి ఆలయానికి వచ్చిన ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల ముందు స్త్రీశక్తి పథకం వర్తించదని బోర్డులు పెట్టారు. వాడపల్లి ఆలయానికి వెళ్లే మహిళా భక్తులకు ప్రభుత్వం ఫ్రీ సర్వీసు వర్తింప చేసేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని మహిళా భక్తులు కోరుతున్నారు.

విద్యార్థినులకు ఊరట..

కాలేజీలకు వెళ్లే విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలకొకసారి రూ.605 చెల్లించి ఆర్టీసీ నుంచి బస్ పాస్‌లు తీసుకునే వార మని.. ఉచిత బస్సు ప్రయాణ నిర్ణయం వల్ల ప్రయోజనం చేకూరిందని వేమగిరికి చెందిన విద్యార్థినులు నిహారిక, రేష్మ, సంధ్య, ధవళేశ్వ రానికి చెందిన సాహితీ తెలిపారు. తూర్పుగోనగూడెంకు చెందిన తోట సత్యవతి, కండిక బుల్లెమ్మ, టి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ తాము నెలకోసారి ఇస్కాన్ టెంపుల్‌కు వస్తామని,బస్సు టికెట్ రూ.30 ఉందని, ఆటో రూ.40 తీసుకునేవారని చెప్పారు. ఇవాళ ఉచితంగా ప్రయాణించామని, చాలా సంతోషంగా ఉందన్నారు. కొందరు ఉద్యోగులు మాత్రం నెలకు రూ.3 నుంచి రూ.4 వేలు ఖర్చు అయ్యేదని..అది ఇవాళ మిగిలినట్టేనని ఆయా ఉద్యోగులు చెప్పడం గమనార్హం.

గుర్తింపుకార్డుల్లేక..


రాజోలు నుంచి రాజమహేంద్రవరం వచ్చిన ప్రయాణికుల్లో ఎక్కువ మంది ఉచిత ప్రయాణం చేశారని ఒక కండక్టర్ తెలిపారు. 10 మంది గుర్తింపు కార్డుల్లేక టికెట్లు తీసుకున్నారని.. వారికి తాము ఉచిత ప్రయాణం గురించి వివరించామన్నా రు.ఇటువంటి పరిస్థితి అన్ని రూట్లలో కనిపించింది.

గుర్తింపుకార్డు జిరాక్స్ ఉన్నా ఓకే : వైఎస్ఎన్

రాజమహేంద్రవరం అర్బన్,ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోజూ సుమారు 32వేల మంది ప్రయాణిస్తుం టారని, అందులో మహిళలే అధికంగా ఉంటారని ఆర్టీసీ జిల్లా అధికారి ఏలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆధార్, ఓటరు, రేషన్ కార్డులను నేరుగా తేలేకపోయినా డిజిటల్, జిరాక్స్‌లు చూపించినా అనుమతిస్తామన్నారు. టిక్కెట్లు జారీ చేసే టిమ్స్ మెషీన్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉమెన్ ఫ్రీ టికెట్ (డబ్ల్యుఎఫ్‌టీ) బటన్‌పై సిబ్బందికి శనివారం ప్రత్యేక అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టిక్కెట్లు జారీ చేసే కండక్టర్, డ్రైవర్లతో ప్రత్యేకంగా మాట్లాడారు.



టిమ్స్ మిషన్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ జిల్లా అధికారి



ఉప్పొంగిన గోదావరి

ధవళేశ్వరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల ఉపనదులు ప్రాణహిత, ఇంద్రావతి నుంచి వరద ప్రవాహం వస్తుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ధవళేశ్వరం వద్ద 24 గంటల వ్యవధిలో 1.75 లక్షల క్యూసెక్కులకు పైగా వరద పెరిగింది.శనివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 4,25,594 క్యూసెక్కులను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు డెల్టా కాలువలకు నీటి విడుదల మరింత తగ్గించారు. తూర్పు డెల్టాకు 2 వేల క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 200 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కులు చొప్పున మొత్తం 2700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం శనివారం సా యంత్రానికి 29.60 అడుగులకు చేరుకుంది.

పోలీస్ స్టేషన్లలో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'

రాజమహేంద్రవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్లలో శుభ్రత చర్యలు చేపడుతున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'చెత్తగించవలెను' శీర్షికన ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో అపరిశుభ్రతపై ప్రచురిత మైన కథనంపై ఎస్పీ నరసింహ కిషోర్ స్పందించారు.ఈ మేరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్, ఎస్ డీపీవో కార్యాలయాల్లో శనివారం 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయంతో పాటు పరిసరాలను పోలీసులు శుభ్రం చేశారు. వ్యర్థాలు, చెత్త తొలగించారు. మొక్కలను నాటారు. కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర' చేపట్టాలని పోలీసులను ఆదేశించారు.



బడికి పోదాం!

బడిబాట పట్టిన చిన్నారులు

- సత్ఫలితాలను ఇస్తున్న సంస్కరణలు
- నిండుగా ప్రభుత్వ పాఠశాలలు
- జిల్లాలో మొత్తం 1544 పాఠశాలలు
- పెరిగిన విద్యార్థుల సంఖ్య 1043
- ప్రైవేటు పాఠశాలల్లో 1287 తరుగుదల



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ బడుల్లో తరగతి గదులు కళకళలా డుతున్నాయి. గతేడాది కంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగ్గా ప్రైవేటు పాఠ శాలల్లో తరుగుదల నమోదుకావడం ఇందుకు నిదర్శనం. మరోవైపు టీచర్స్ పేరెంట్స్ మేగా మీట్ పేరుతో నిర్వహిస్తున్న బడి పండుగ సత్ఫలితాలనిస్తోంది. నాడు.. బడులకు రంగులు వేస్తున్నామంటూ వైసీపీ నేతలు మేసేశారు. ట్యాబ్‌లు, యాప్‌లంటూ బోధన కకావికలం చేశారు.నేడు.. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యా మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ చూపిస్తూ ప్రక్షాళన మొదలుపెట్టారు. పాఠశాలల్లో మార్పులు తీసుకొచ్చి బోధనలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

నాడు జీరో.. నేడు ఫుల్

గత వైసీపీ ప్రభుత్వంలో అటు ఉపాధ్యా యులకు బోధనకు సమయం లేక పోగా.. ఇటు విద్యార్థుల చదువు అటకెక్కింది. సీబీఎస్‌సీ, ఐబీ అంటూ రోజుకో సిలబస్, ట్యాబ్‌లు, ఫ్లాట్ ప్యానెళ్లు ఇలా ప్రచార ఆర్భాటానికి విద్యా వ్యవస్థను అవస్థల్లోకి నెట్టేశారు. పిల్లల్లో అభ్యసనా సామర్థ్యం అడుగంటే దుస్థితికి చేరుకొంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రేపటి పౌరుల బంగారు భవిత కోసం విద్యారంగాన్ని గాడిలో పెట్టే పని మొదలు పెట్టింది. విద్యా మంత్రిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచే నారా లోకేశ్ విద్యను గాడిలో పెట్టడంపై ప్రత్యేక దృష్టి సారించారు.ఆ మేరకు ప్రతి పాఠశాలలోని, ప్రతి విద్యార్థిపై దృష్టి సారించారు. పాఠశాలల్లో యాప్‌ల గోల తగ్గించారు. బోధనా సమయాన్ని పెంచారు. విద్యార్థి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు/సంరక్షకులు కూర్చుని విద్యార్థి భవిష్యత్తు, బడి అభివృద్ధే లక్ష్యంగా స్నేహ పూర్వకంగా చర్చించడానికి ఏడాదికి ఒకసారి పేరెంట్స్ టీచర్స్ మెగా మీట్ అంటూ చక్కటి వేది క ఏర్పాటు చేసింది. దీనివల్ల పాఠశాలలకు పాలకులు ఇస్తున్న నిధులు, చేస్తున్న అభివృద్ధి, చదువుకోవడానికి కల్పిస్తున్న వాతావరణం వంటి వాటిని పారదర్శకంగా ఉంచడానికి వీలు కలిగింది. విద్యార్థి వాస్తవ పరిస్థితి తల్లిదండ్రులకు తెలియడం, వాడిని తీర్చిదిద్దడానికి ఉన్న మార్గాలు చర్చించుకోవడం జరుగుతోంది. ఈ ఏడాది జిల్లాలో 976 ప్రభుత్వ, 568 ప్రైవేటు, 120 ఇంటర్మీడియట్ కళాశాలల్లోని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు తదితరులు సుమారు 3 లక్షల మంది వేడుకలకు హాజర య్యారు. గతేడాది ప్రభుత్వ పాఠశా లల్లో మాత్రమే నిర్వహించిన ఈ వేడుక లను ఈ సారి ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీ డియెట్ కళాశాలలకు విస్తరించారు.

ఇవిగో లెక్కలు

మండలం	ప్రభుత్వ	ప్రైవేటు	24-25	25-26
అనపర్తి	3778	3817	4355	4326
బిక్కవోలు	3117	3254	2880	2687
చాగల్లు	2866	2879	3579	3368
దేవరపల్లి	4759	4751	6460	6326
గోకవరం	5580	5600	3959	4005
గోపాలపురం	4832	5031	3271	2918
కడియం	4353	4372	5859	5886
కోరుకొండ	5391	5428	6700	6265
కొవ్వూరు	4987	5133	8314	8055
నల్లజర్ల	4519	4532	7615	7778
నిడదవోలు	5243	5284	8489	8112
పెరవలి	2655	2672	4697	4875
రాజమండ్రి	7894	7989	23767	24824
రాజమండ్రి(రూ)	11389	11593	37105	36675
రాజానగరం	5342	5218	10958	11078
రంగంపేట	3305	3336	2710	2536
సీతానగరం	3830	3803	4556	4348
తాళ్లపూడి	2746	2853	2942	2994
ఉండ్రాజవరం	3034	3118	5446	5328
	89620	90663	153672	152385

1043 మంది పెరుగుదల

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి పదో తరగతి వరకూ గతేడాది 89620 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది ఆ సంఖ్య 90663కి చేరడంతో 1043 పెరుగుదల నమోదైంది.దాదాపుగా ప్రతి మండలంలోని విద్యార్థుల సంఖ్య పెరిగింది. అదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో గత ఏడాది 153672 మంది విద్యార్థులుండగా ఈ ఏడాది 1287 మంది తరుగుదలతో 152385తో సరిపెట్టుకున్నాయి.



ముంచిన వాన

తాళ్లపూడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నిన్నటి వరకూ వానల్లేవ్..వానల్లేవ్ అనుకున్నారంతా.. వరుణుడు వచ్చాడు.. ప్రతి రోజూ ఏదో ప్రాంతంలో దంచికొడుతున్నాడు.. లోతట్టు ప్రాంతాలను ముంచుతున్నాడు.తాళ్లపూడి, రాజమహేంద్రవరం తదితర మండలాల్లో శనివారం పెద్ద ఎత్తున వర్షం పడింది.దీంతో తాళ్లపూడి, వేగేశ్వరపురం, గజ్జరం తదితర గ్రామాల్లో వర్షం నీటితో రహదారులు సైతం మునిగిపోయాయి. రాజమహేంద్రవరంలో హైటెక్ బస్టాండ్ ఆవరణ చెరువులా మారింది. వేగేశ్వరపురం గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయం నీటితో నిండిపోయింది.



అన్నదాతల ఆనందం

అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీని కోరుకొండలో శనివారం నిర్వహించారు. సుమారు 500 ట్రాక్టర్లపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి తదితరుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. రైతులు జై చంద్రబాబు నినాదాలతో హోరెత్తించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చిక్కాల ఫీడర్‌లో చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు నిడదవోలు ఈఈ నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పల్లంట్ల, లక్ష్మీపురం, చిక్కాలలోని వ్యవసాయ రంగానికి అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

• ప్రత్యేక వేషధారణలతో అలరించిన చిన్నారులు



గోష్పాదక్షేత్రంలో పూజలు చేస్తున్న ఆలయ పండితుడు

కొవ్వూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం పట్టణం, మండలంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లాంచీలరేవు వద్ద వేంచేసియున్న శ్రీరామానంద గౌడీయామఠంలో మఠాధిపతి భక్తి విభూద వామన మహారాజ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి అర్ధరాత్రి శ్రీకృష్ణుడు ఆవిర్భవించిన సమయం వరకు విశేషపూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధికసంఖ్యలో ప్రత్యేక అర్చనలు చేశారు. శ్రీకృష్ణుడు ఆవిర్భావ సమయంలో విశేష అర్చనలు, అభిషేకాలు, హారతులు సమర్పించారు. కార్యక్రమంలో శ్రీపాద రమణకృష్ణదాస్, భక్తులు పాల్గొన్నారు. అలాగే గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న శ్రీమద్ భగవద్గీత మందిరంలో శివానంద దాస్ మహారాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం నందోత్సవం, మధ్యాహ్నం మహాప్రసాద వితరణ (అన్నదానం), ఈనెల 31వ తేదీన రాధాష్టమి నిర్వహించడం జరుగుతుందన్నారు. వాడపల్లిలోని శ్రీకృష్ణ ఆలయంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేగి చిన్ని, బూరుగుపల్లి రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: శింగవరంలో వేంచేసి వున్న రుక్మిణీ సత్యభామ సమేత మురళీకృష్ణ స్వామికి శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి కిరణ్ ఆచార్యులు ఆధ్వర్యంలో పొన్నా కృష్ణబాబు దంపతులచే స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు చేశారు. లింగాల సుబ్బమ్మ ఆధ్వర్యంలో గీతా సత్సంగంచే భగవద్గీత పారాయణం, విష్ణు సహస్రనామాలు జరిగాయి. పొన్నా కృష్ణవేణమ్మ, పలువురు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని షైనింగ్ స్టార్స్ ప్లే స్కూల్‌కు చెందిన చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలో ఆటపాటలతో అలరించారు.

నల్లజర్ల: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రకాశరావు పాలెంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.అలాగే తిమ్మన్నపాలెం, కృష్ణమ్మగూడెం, అనంతపల్లి, సుభద్రపాలెం, పోతవరం, చీపురుగూడెం, నల్లజర్ల, దూబచర్లలో ఉట్టి కొట్టే కార్యక్రమాలు జరిగాయి. యువకులకు నూతన వస్త్రాలు, నగదు బహూకరించారు.

తాళ్లపూడి: మండలంలోని పలు ఆలయాల్లో కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మదన గోపాలస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద ఉట్టి కొట్టించారు. ప్రక్కిలంకలో గోదావరి నదీ తీరం వద్ద ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన కృష్ణ మందిరంలో ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఉదయం మంగళహారతి, గురుపూజ అనంతరం రాధాకృష్ణులకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు శనివారం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తొలుత కృష్ణుని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందరంగా తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి వాడవాడలా ఉట్టికొట్టే కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

దేవరపల్లి : దేవరపల్లి మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రధాన దేవాలయాల్లో శనివారం ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీరాధాగోపీనాథ్ మందిరంలో ఉదయం నుంచి నగర సంకీర్తన, సుదర్శన హోమం, లక్ష్మీ నరసింహస్వామి హోమం, శ్రీకృష్ణహోమం, శ్రీరాధాకృష్ణ స్వామివారికి మంగళస్నానం, మహానివేదన, భోగహారతి నిర్వహించారు. దేవరపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు జన్మాష్టమి మహోత్సవాలను నిర్వహించారు. దీనిలో భాగంగా శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించారు. పిల్లలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో నృత్యప్రదర్శనలు చేశారు. శ్రీరాధాగోపీనాథ్ మందిరం వద్ద ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఉట్టికొట్టు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో రాధాకృష్ణ గోపీనాథ్ మందిరం చైర్మన్ ఉప్పలపాటి కళావతి, ఆర్యవైశ్యసంఘం మహిళా అధ్యక్షురాలు తీగల మంజూ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్తగుండి బాబూరావు, తీగల బలరామయ్య, తదితరులు పాల్గొన్నారు. శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం శనివారం సందర్భంగా అధికసంఖ్యలో మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దేవరపల్లి మండలంలోనే కాకుండా చాగల్లు నుంచి ఏడు శనివారాలు మొక్కుబడిలో భాగంగా భక్తులు నడిచివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు గుడ్ల వెంకటేశ్వరరావు, యాళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. చాగల్లు సెంటర్‌లోని వేణుగోపాలస్వామి వారి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ నాయకుడు కరుటూరి సతీష్, తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. కొత్తపేట రామాలయం ప్రాంగణంలోనూ వేడుకలు జరిగాయి. గారపాటి శ్రీనివాసరావు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. పిండుంగొయ్యి రామాలయం వద్ద, దానవయ్యిపేటలోని వేణు గోపాలస్వామి వారి ఆలయం, మెయిన్‌రోడ్డుపైన ఉన్న వేపర్లవారి గుడి వద్ద ఉట్టికొట్టే కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. ఊనగట్ల వేణు గోపాలస్వామి వారి ఆలయం, చిక్కాల వేణుగోపాలస్వామి వారి ఆలయంలోనూ వేడుకలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



నిడదవోలులో స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న భక్తులు



మదనగోపాల స్వామి ఆలయంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు



చాగల్లు కొత్తపేట రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నిరంతరం రోగులకు అందుబాటులో ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి - ఆకస్మికంగా హుకుంపేట పీహెచ్‌సీ తనిఖీ

గోపాలపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే వైద్యులు నిరంతరం రోగులకు అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి అన్నారు. స్థానిక హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ విధి నిర్వహణలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దేశించిన సమయంలో విధులు నిర్వహించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వైద్యసేవలందించాలన్నారు. ఆసుపత్రిలో ఓపీ సేవలను మరింత పెంచాలన్నారు. ఈమెతోపాటు సిబ్బంది, తదితరులు ఉన్నారు.



హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సంధ్యారాణి, పక్కన ఆసుపత్రి వైద్యులు

ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల్లో ఆనందం

నిడదవోలు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా శుక్రవారం స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం నిడదవోలు నుంచి జిల్లా కేంద్రమైన రాజమండ్రి వెళ్లే ఆర్టీసీ బస్సులో 55 మంది ప్రయాణికులు ఉండగా, అందులో కేవలం 10 మంది మాత్రమే పురుషులు ఉన్నారు. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' ఇలా క్లిక్ మనిపించింది.



నిడదవోలు నుంచి రాజమండ్రి వెళ్లే బస్సులో మహిళలు

ఏపీజీఈఏ ఆవిర్భావ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కొవ్వూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, ఉద్యోగులకు మధ్య వారధిగా ఏపీజీఈఏ పనిచేస్తుందని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఏజేసీ చైర్మన్ నక్కా వెంకటరత్నం అన్నారు. శనివారం కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. వెంకటరత్నం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాలూకా యూనిట్లలో ఈ వేడుకలు జరుపుకున్నామన్నారు. కార్యక్రమంలో దాసరి మోహన్, సుంకవల్లి హరికృష్ణ, మర్రి సుబ్రహ్మణ్యం, పోలిశెట్టి శివ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు అందజేత

కొవ్వూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యాబోధనతో పాటు ఆటపాటల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమని మండల టీడీపీ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కుమారదేవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు స్పోర్ట్స్ కిట్లు, డ్రెస్‌లను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పాఠశాల స్కూల్ అసిస్టెంట్, హిందీ ఉపాధ్యాయురాలు సోడదాసి మణిదీపిక 15 జతలు, ఇంగ్లీషు ఉపాధ్యాయురాలు ఎస్ఎన్‌మల్లిక 12 జతలు స్పోర్ట్స్‌కిట్లు పంపిణీ చేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్.సురేష్ వాలీబాల్స్, సోషల్ ఉపాధ్యాయురాలు ఏ.వెంకటలక్ష్మి బాస్కెట్ బాల్స్ తెలుగు టీచర్ సూర్యనారాయణ స్కిప్పింగ్ రోప్స్, మ్యాథ్స్ ఉపాధ్యాయుడు మోహనరావు టెన్నికాయిట్ రింగ్స్, పీఎస్ ఉపాధ్యాయుడు అర్జునుడు హుప్స్, ఎస్ఎస్ రాజేంద్ర వాలీబాల్ పోల్స్ బహూకరించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న టీడీపీ మండల అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, పంపింగ్ స్కీమ్ అధ్యక్షుడు గోరిజాల సురేష్ స్పోర్ట్స్ కిట్లను విద్యార్థులకు అందించారు.



దుస్తులను చూపుతున్న టీడీపీ నేతలు, ఉపాధ్యాయులు

పోలీస్ వారి హెచ్చరిక

నిడదవోలు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో ప్రయాణికుల్లా ప్రయాణిస్తూ తోటి ప్రయాణికుల నుంచి డబ్బు, బంగారు నగలు, విలువైన వస్తువులు దొంగిలించే వారి పట్ల అవగాహన కలిగి ఉండాలని, అలాంటి వారు ఎక్కడైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ పీవీజీ తిలక్ అన్నారు. శనివారం పట్టణంలోని గణపతి సెంటరులో ఆటోలపై బంగారు వస్తువులు, సెల్‌ఫోన్‌లు, డబ్బులు కాజేసే మహిళల ఫొటోలతో ఉన్న స్టిక్కర్‌ను అంటించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ మాట్లాడుతూ అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు జగన్మోహన్, పరమహంస, సిబ్బంది ఉన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతం



పుల్లలపాడులో వ్రతం చేస్తున్న మహిళలు

నల్లజర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దానధర్మ చారిటబుల్ ట్రస్ట్, వేద సంకల్ప సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పుల్లలపాడు హరిజనపేట రామాలయంలో శనివారం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. పురోహితులు అరిపిరాల రుద్రమూర్తి వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. పూజలో పాల్గొన్న 30 మంది మహిళా భక్తులకు చీర, జాకెట్, పూజా సామాగ్రి అందించారు. కార్యక్రమంలో ఉండ్రాజవరపు వెంకటరత్నం, పాతూరి వరప్రసాద్, పాతకోకల వెంకట్, సంఘమిత్ర విద్యాసంస్థల డైరెక్టర్ అంబటి శ్రీనివాస్, నందమూరి రామకృష్ణ పాల్గొన్నారు.

రామకృష్ణను పరామర్శించిన శేషారావు



ఉండ్రాజవరంలో రామకృష్ణను పరామర్శిస్తున్న శేషారావు, టీడీపీ నేతలు, కార్యకర్తలు

ఉండ్రాజవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ సోదరుడు (అన్నయ్య) సింహాద్రి రామారావు మృతిపై రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం ఉండ్రాజవరంలో రామకృష్ణ కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు. ఈయనతోపాటు పసలపూడి, దమ్మెన్ను, ఉండ్రాజవరం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైతు మృతి

గోపాలపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లే పంట బోదే తూమును కడుతూ ప్రమాదవశాత్తు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని రామపాలెంలో చోటుచేసుకుంది. రైటర్ దుర్గారావు తెలిపిన వివరాలివి... శనివారం ఉదయం రామ్‌పాలెం గ్రామానికి చెందిన ఏసులంక బుల్లివెంకన్న (39) గ్రామశివారులో ఉన్న పాలంక చెరువు దగ్గర పంటపొలాలకు వెళ్లే బోదికి సంబంధించి తూములు కడుతుండగా, ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయి చనిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించారు.

వైసీపీలో పెన్షనర్లకు తీవ్ర అన్యాయం

• విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేమ్స్

నల్లజర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు తీవ్ర అన్యాయం చేసిందని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ.జేమ్స్ అన్నారు. శనివారం నల్లజర్లలోని వేణుగోపాల స్వామి కల్యాణ మండపంలో విశ్రాంత ఉద్యోగుల మండల స్థాయి సమావేశం జరిగింది. దీనికి మండలాధ్యక్షుడు ఐవీ సత్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జేమ్స్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించి, ఉద్యోగుల ఆరోగ్యకార్డులపై పూర్తిస్థాయి నగదు రహిత వైద్యం అందించాలన్నారు. అనంతరం నూతన మండల కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా ఐవీ సత్యం, గౌరవ అధ్యక్షుడు ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఐడీవీ అప్పారావు, కోశాధికారి కే. ప్రభుదాసు, ఉపాధ్యక్షుడు ఎస్ఎం అలీసాహెబ్, కామేశ్వర రావు, నెక్కలపూడి ప్రతాప్, దత్తు, ఏసురత్నం, ఝాన్సీ రాణి, రామదాసు ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రజనీ కుమార్, తదితరులు

తాళ్లపూడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని శనివారం ఆటో యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. యువశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ సెంటరులో ఏర్పాటు చేసి కార్యక్రమంలో అధ్యక్షుడు రజనీ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటు చేయడం మంచిదే, కానీ దీని కారణంగా పరోక్షంగా తమ ఆటోలపై తీవ్ర ప్రభావం పడుతోందని వాపోయారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అమలుతో తమ కుటుంబాలు వీధిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 20 సంవత్సరాల నుంచి ఆటోలపైనే జీవనం సాగిస్తున్నామన్నారు. తమ యూనియన్‌లోనే దాదాపుగా 250 వరకు ఆటో యూనియన్ సభ్యత్వాలు కలిగి ఉన్నాయన్నారు. ఏదిఏమైనా ఆటోడ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

మెరికమ్మకు ఉత్తమ తహశీల్దార్ అవార్డు

చాగల్లు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా తహశీల్దార్ ఎం. మెరికమ్మ ఉత్తమ ఉద్యోగి అవార్డును మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పీ. ప్రశాంతి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఆమె ను కలిసి అభినందనలు తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు గాను తనకు ఈ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే సివిల్ సప్లయ్స్ డీటీ ఎం. సునీత కూడా ఉత్తమ ఉద్యోగి అవార్డును మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నారు.



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దృశ్యం (ఫైల్)

'పురస్కారం మరింత బాధ్యతను పెంచింది'



మాట్లాడుతున్న కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శివరామకృష్ణ, పక్కన బ్యాంక్ డైరెక్టర్లు

కొవ్వూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విశిష్ట సేవా పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని కొవ్వూరు కోపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుని మంత్రి దుర్గేష్, కలెక్టర్ చేతులమీదుగా శివరామకృష్ణ పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. దీనిలో భాగంగా శనివారం ఆయన్ని డైరెక్టర్లు దాయన రామకృష్ణ, పాలింపాటి చిన్నబాబు, కుప్పాల ప్రసాద్, బ్యాంకు సెక్రటరీ వీఎస్ శ్రీనివాస్, తదితరులు అభినందించారు.

కమ్యూనిస్టు ఉద్యమం పునరేకీకరణ జరగాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టుల చీలిక వల్ల రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే తీవ్రంగా నష్టపోయాం, ఈ నేపథ్యంలో కమ్యూనిస్టులు మరింత సమర్థవంతంగా, సమరశీలంగా పనిచేయాలంటే కమ్యూనిస్టు ఉద్యమం పునరేకీకరణ జరగాలని పిలుపునిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. దేశంలో ప్రధానమైన కమ్యూనిస్టు పార్టీలు సీపీఐ, సీపీఎం మరింత ఐక్యతతో ముందుకు సాగాలని అనుకుంటున్నామని వ్యాఖ్యానించారు. శనివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 25శాతం పేదరికం తగ్గించామని ప్రధాని మోదీ గొప్పగా చెప్పుకుంటున్నారని, ఒక వేళ దేశంలో అంత పేదరికమే తగ్గితే ఉచితంగా అన్ని కోట్ల మందికి బియ్యం, గోధుమలు ఎందుకిస్తున్నారని రామకృష్ణ ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వంలో అదానీ, అంబానీలు, కోటీశ్వరులను పోషిస్తున్నారు తప్ప పేదరికం తగ్గలేదని, వారి జీవన ప్రమాణాలు పెరగలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పేదలను మోసం చేస్తున్నాయని, పోలవరం సమస్యలపై దశల వారీ ఉద్యమం చేస్తామన్నారు. పోలవరం ఎత్తు తగ్గిస్తామని మోదీ చెబుతుంటే దానికి సీఎం చంద్రబాబు మాట్లాడకపోవడం ఏమిటన్నారు. తాము ప్రస్తుతం పేద, బలహీనవర్గాల వారికి ఇళ్ల స్థలాల కోసం ఉద్యమిస్తున్నామన్నారు. మోదీ, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను నట్టేట ముంచారని, ఎవరికి ఉద్యోగాలిచ్చిన పాపాన పోలేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, కె.రాంబాబు, వి.కొండలరావు, సప్ప రమణ, పి.లావణ్య, అల్లం వెంకటేశ్వరరావు, సీహెచ్ సునీల్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

దేవీపట్నం/కూనవరం/కోరుకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల కోసం నిర్మించిన పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించలేదని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సీపీఎం పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ హెచ్చరించారు. శనివారం పోలవరం నిర్వాసిత ప్రాంతాల్లో పర్యటించేందుకు వచ్చిన ఆయన తొలుత మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు కేంద్ర కమిటీ సభ్యుడు బి.లోకనాథం, సీపీఎం తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి బికిరణ్ ఇతర నాయకులు స్వాగతం పలికారు. అక్కడ ఆయన గిరిజన సాంప్రదాయంలో భాగమైన కొమ్మును బేబీ తలపై ధరించారు. అనంతరం కొద్దిసేపు నాయకులతో మాట్లాడి అక్కడ నుంచి దేవీపట్నం బయల్దేరారు.

ఎక్కడ చూసినా మురుగే..!

• పట్టణంలో ప్రబలుతున్న అంటువ్యాధులు • పట్టించుకోని అధికారులు

కొవ్వూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపాల్టీలో అపారిశుధ్యం తాండవిస్తోంది. ఎక్కడచూసినా డ్రైనేజీల్లో మురుగే దర్శనమిస్తోంది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగిరోడ్లపై ప్రవహిస్తున్నాయి. దీంతో దోమలు వ్యాప్తి చెందడంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. ప్రధానంగా డ్రైనేజీల్లో పూర్తిస్థాయిలో మురుగు డిసిల్టేషన్ చేయకపోవడంతో ఈ పరి స్థితి దాపురిస్తోంది. ఇప్పటికే పట్టణమంతా వైరల్ జ్వరాలు ఉన్నాయి. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదు. అలాగే డ్రైనేజీల్లోని మురు గు, ఖాళీస్థలాల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కల తో విషపురుగులకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇంత జరుగుతున్నా... ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపానపోలేదు. తూతూమంత్రంగా పర్యటనలు, సమీక్షలు చేపట్టి పత్రికలు, టీవీల్లో ప్రక టనలు గుప్పిస్తున్నారే తప్ప పారిశుధ్యంపై చర్యలు శూన్యం. ఇలాగే కొనసాగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇదే పాలకవర్గంలో గతంలో శ్రీరామకాలనీలో అంటువ్యాధులు ప్రబలిన సంఘటనలూ ఉన్నాయి. అయినప్పటికీ మున్సిపల్ అధి కారులు, పాలకవర్గం పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ కనబర్చకపోవడంతో ప్రజల నుంచి పలు విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి పట్టణంలోని 23వ వార్డుల్లోనూ వర్షాకాలంలో ప్రత్యేక శానిటేషన్ పనులు చేయించి అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు, తదితరులు కోరుతున్నారు.



శ్రీరామకాలనీలోని 3వ వీధిలో దర్శనమిస్తున్న మురుగు



చిన్నపాటి వర్షానికే రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న వర్షపు నీరు

